01ATP13F_01ATP13F.qxd 13-12-2025 PM 11:16 Page 1

అనంతపురం/శ్రీ సత్యసాయి వార్త

తెలుగు జాతీయ దినపత్రిక

ఆదివారం 14 డిసెంబర్ 2025 పేజీలు : 04

రైతుల అభ్యున్నతికే కూటమి ప్రభుత్వం పెద్ద పీట

- సబ్సిడి ధరలతో రైతులకు డ్రోన్లు అందించేందుకు 15 సొసైటీలు ఎంపిక
- ఎడిసిసి బ్యాంకు పురోగాభివృద్ధికి ప్రత్యేక చర్యలు
- ఇళ్ల నిర్మాణాలకు కూడా రుణాలు ఇవ్వాలని నిర్ణయం
- రైతులకు రుణాలను ఎకరాకు రూ.3 నుంచి 5 లక్షలు చేశాం
- ఎల్‌టి లోన్లను కూడా పెంచాం
- ప్రభాతవార్త ఇంటర్వ్యూలో ఎడిసిసి అధ్యక్షులు ముంటిమడుగు కేశవరెడ్డి

అనంతపురం, డిసెంబర్ 13 ప్రభాతవార్త బ్యూరో

రైతులన్న అభ్యున్నతే ధ్యేయంగా రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని అందులో భాగంగా రాష్ట్రంలో వచ్చే మూడేళ్లలో 200 సొసైటీల్లో రైతులు డ్రోన్ల కొనుగోలుకు సబ్సిడీలు ఇవ్వాలని నిర్ణయం తీసుకుందని, అందులో భాగంగా ఉమ్మడి అనంతపురంజిల్లాలో15 ఎఫ్‌పిఒ(సొసైటీ) లను ఎంపికచేసినట్లు అనంతపురం జిల్లా ఏడిసిసి బ్యాంకు అధ్యక్షులు ముంటిమడుగు కేశవరెడ్డి వెల్లడించారు. ప్రభాతవార్త ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఏడిసిసిబ్యాంకు అధ్యక్షులుగా బాధ్యతలుచేపట్టిన ఐదునెలల కాలంలోనే బ్యాంకు పురోగతికి, రైతుల అభ్యున్నతికి తీసుకుంటున్న పలు చర్యలను కేశవరెడ్డి వివరించారు. రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునేందుకు సిద్ధమవుతున్నారని అందులో భాగంగా డ్రోన్లు వినియోగించుకునేందుకు ఎక్కువఉత్సాహాన్ని చూపుతున్నట్లు ఆయనతెలిపారు. రైతుల ఉత్సాహాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రయోగాత్మకంగా ఉన్నతాధికారుల సూచనల మేరకు ఉమ్మడి అనంతపురం జిల్లాలో 15 ఎఫ్‌పిఒ(సొసైటీ)లను ఎంపిక చేశామని ఆ సొసైటీల ద్వారా రైతులకు ప్రయోగాత్మకంగా డ్రోన్లు సబ్సిడి ధరలతో అందించేందుకు చర్యలు తీసుకోబోతున్నట్లు ఆయన తెలిపారు. ఈ 15 ఎఫ్‌పిఒల వివరాలను పరిశీలిస్తే అనంతపురం జిల్లాలో కణేకల్లు మండలంలో శ్రీధరఘట్ట, రాయదుర్గం మండలంలో కల్లుగోడు, తాడిపత్రి మండలంలో చిన్నపప్పూరు, ఎగువపల్లి, పిఏసిఎస్‌లను ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. ఆత్మకూరు మండలంలో పియాలేరు సొసైటీని ఇందులోభాగంగా ఎంపిక చేశామన్నారు. శ్రీ సత్యసాయి జిల్లాలో కొత్తచెరువు మండలంలో బండ్లపల్లి, పెనుకొండ మండలంలో సోమందేపల్లి, ఓడిసి మండలంలో అల్లాపల్లి, తనకల్లుమండలంలోపి.సదం, హిందూపురం మండలంలో పరిగి, పుట్టపర్తి మండలంలో పుట్టపర్తి, గోరంట్లమండలంలో గోరంట్ల సొసైటీలను ఎంపిక చేశామన్నారు. అదే విధంగా శ్రీ సత్యసాయి జిల్లాలో రొళ్ల,గూనిపల్లి, అమడగూరు పిఎసిఎస్‌లను ఎంపికచేసినట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలో ప్రయోగాత్మకంగా వచ్చే మూడేళ్లలో డ్రోన్లకు సొసైటీల ద్వారా సబ్సిడీలు ఇవ్వాలని, 200సొసైటీలను ఎంపికచేయగా ఉమ్మడి అనంతపురం జిల్లాకు సంబంధించి అనంతపురం జిల్లాలో ఐదు మిగతా వన్నీ శ్రీసత్యసాయి జిల్లాలో ఎంపిక చేసినట్లు ఆయన వివరించారు. ఇదే సమయంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అభ్యున్నతి కోసం ప్రత్యేకచర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. తాను చైర్మన్‌గా పదవి బాధ్యతలు చేపట్టిన ఐదు నెలల కాలంలో బ్యాంకు ప్రక్షాళనకు శ్రీకారం చుట్టానని ఒకవైపు రైతుల అభ్యున్నతి కోసం ప్రత్యేకచర్యలు తీసుకుంటూనేమరోవైపు బ్యాంకును లాభాలబాటలో పయనింపజేసేందుకు, జాతీయ బ్యాంకుల తరహాలో ప్రజలకు సేవలు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి తెలిపారు. తాను బ్యాంకు చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టినప్పుడు 1800 కోట్ల టర్నోవర్ ఉండేదని,

ఎడిసిసి బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి

ఇప్పుడు 2086 కోట్ల టర్నోవర్‌కు తీసుకొచ్చానని ఆయన వెల్లడించారు. సొసైటీలు, ఇతర బ్రాంచ్‌ల ద్వారా సేవలు పెంపొందించి బ్యాంకు టర్నోవర్‌ను 2,500 కోట్లకు తీసుకురావాలనే లక్ష్యంతో ఉన్నట్లు ఆయన తెలిపారు. బ్యాంకు సిబ్బంది, అధికారుల సహకారంతో బ్యాంకు పురోగాభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. తాను చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత రైతుల రుణాలను పెంచామని ఆయన గుర్తు చేశారు. గతంలో ఎకరాకు 3లక్షలవరకే రుణాలు ఇచ్చేవారని 3నుంచి 5లక్షల వరకు రుణంఇచ్చే సదుపాయాన్ని పెంపొందించినట్లు ఆయన తెలిపారు. సొసైటీల్లో ఎల్‌టి రుణాలను కూడా పెంచామని 30లక్షలవరకు ఎల్‌టిరుణాలను ఇచ్చే సదుపాయాన్ని పెంపొందించినట్లు ఆయన తెలిపారు. రైతుల కోసం సహకార సంఘాల ద్వారా విస్తృత చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వెల్లడించారు.

ఫైళ్లు రెండు రోజులకు మించి ఉండరాదు

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ప్రధాన కార్యాలయంలో రెండు రోజులకు మించి ఫైళ్లు పెండింగ్‌లో ఉండరాదని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చానని, ఇందులో భాగంగా ఫైళ్ల క్లియరెన్స్ త్వరగా జరిగేవిధంగాచర్యలు తీసుకుంటున్నట్లు ఏడిసిసి బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి తెలిపారు. రుణాలు, ఇతర పథకాల విషయాల్లో సొసైటీలు,కిందిస్థాయి వివిధ బ్రాంచులు పంపేఫైళ్లకు సంబంధించి త్వరగా నిర్ణయాలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు ఆదేశాలు ఇచ్చారని ఫైళ్ల క్లియరెన్స్ ఆలస్యమైతే సీరియస్‌గా పరిగణించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ ప్రక్రియవల్ల మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకుకు దాదాపు 188 కోట్ల రూపాయలు ఎంపిఏ కింద పాత బకాయిలు ఉన్నట్లు ఓప్రశ్నకు సమాధానంగాచెప్పారు. ఎంపిఏ రుణాలు 13 శాతం ఉన్నాయని వాటిని 5 శాతానికి తగ్గిస్తే తమ బ్యాంకు ద్వారా విస్తృత చర్యలు తీసుకునేందుకు ఎక్కువ అవకాశాలు ఉంటాయని ఆయన వెల్లడించారు. అందులో భాగంగా ఎంపిఏ రుణాలను తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు, దీనికి సంబంధించి వన్‌టైం సెటిల్ మెంట్ కింద ఎన్‌పిఏ రుణాలపై తగిన చర్యలు తీసుకునేందుకు ఆప్కాబ్ ఉన్నతాధికారులకు ఆశ్రయించినట్లు ఆప్కాబ్‌తో సంప్రదింపులు జరుపుతున్నట్లు బ్యాంకు చైర్మన్ కేశవరెడ్డి వెల్లడించారు.

ఇక హౌస్ లోన్లు కూడా ఇస్తాం :

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అనుబంధంగా ఉన్న బ్రాంచ్‌లు, ఎంపికి చేసిన సొసైటీల్లో ఇంటి రుణాలు కూడా ఇవ్వాలని సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకున్నామని దశల వారీగా అమలు చేస్తామన్నారు. ఇంటి రుణాలను దాదాపు 35 లక్షల వరకు ఇస్తామని ఆయన వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు ఇతర వర్గాలు ఇళ్ల నిర్మాణానికి రుణాల ఇచ్చే సమయంలో వారికున్న భూములను పరిగణలోకి తీసుకుంటామన్నారు. పట్టణ ప్రాంతాల్లో స్థలాల విలువ ఎక్కువగా ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటి స్థలం విలువ తక్కువగా ఉంటుంది, ఈ పరిస్థితుల్లో గ్రామీణ ప్రాంతాల్లో స్థలం ఆధారంగానే ఎక్కువ రుణాన్ని ఇచ్చే అవకాశం లేనందు సంబంధిత రైతుల భూములను పరిగణలోకి తీసుకుని ఇంటి రుణాలు ఇస్తామని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. వ్యవసాయ రుణాలు, ఇంటి రుణాలను ఒక్కొ రైతుకు 40 లక్షలలోపే ఉంటాయన్నారు. ఇప్పటికే వ్యవసాయ రుణాలు ఎక్కువగా తీసుకుంటే ఇంటి రుణాలు ఎక్కువగా ఇచ్చేందుకు వీలు కాదని,నిబంధనలప్రకారం ఇంటిరుణాలు ఇచ్చేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకుంటారని ఆయన తెలిపారు. రైతుల అభ్యున్నతికోసం సహకార బ్యాంకులు విస్తృత చర్యలు తీసుకోవాలంటే బ్యాంకులు కూడా పటిష్టంగా ఉండాల్సిన అవసరం ఉందని అందులో భాగంగా ఇంటి రుణాలను కూడా కొత్తగా ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

580 కోట్ల డిపాజిట్లు :

జిల్లాకేంద్ర సహకారబ్యాంకు పరిధిలోని ప్రధాన కార్యాలయంలోనూ, ఇతరబ్రాంచుల్లో కలిపి 580 కోట్ల డిపాజిట్లు ఉన్నాయని, ఇతర కమర్షియల్ బ్యాంకులకంటే మెరుగైనవడ్డీని తాము ఇస్తున్నందున ఖాతాదారులు ఎక్కువగామొగ్గు చూపుతున్నారని బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు తెలిపారు. ఇదే సమయంలో ఏడిసిసి బ్యాంకు అనుబంధంగా 28 బ్రాంచ్‌లు, 109 సొసైటీలు ఉన్నాయన్నారు. 28 బ్రాంచుల్లో దాదాపు 13 బ్రాంచులు అద్దె భవనాల్లో ఉన్నాయని వాటిని రాబోయే కాలంలో సొంత భవనాలను సమకూర్చు కోవాలనే ఆలోచనతో ఉన్నట్లు ఆయన తెలిపారు. సొంత భవనాల కోసం అవసరమైన ప్రభుత్వ స్థలాలను ఇవ్వాలని రెవెన్యూ అధికారులను కోరాలనే ఆలోచనలో ఉన్నట్లు ఆయనతెలిపారు. కళ్యాణదుర్గంలో తమ బ్రాంచ్‌కు స్థలం కేటాయించారని, అందులో కొత్త భవనాన్ని నిర్మించ బోతున్నట్లు ఆయన తెలియజేశారు. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ప్రధాన కార్యాలయం ప్రధాన బ్రాంచ్‌ను జాతీయ తరహాలో ఆధునీకరించబోతున్నామని దశల వారీగా ఇతర బ్రాంచులను కూడా ఆధునీకరిస్తామని ఆయన వెల్లడించారు. ఇందులో భాగంగా బ్యాంకు ఉద్యోగులు అధికారులు బ్యాంకు పురోగతి కోసం ఇంకా ఎక్కువ ప్రత్యేక దృష్టి పెడతారని ఆశిస్తున్నట్లు బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతోపాటు ఎమ్మెల్యేలు, ఎంపిలు, మంత్రులు, జిల్లా అధికారుల సహాయ సహకారంతో రాబోయే రోజుల్లో బ్యాంకు అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోబోతున్నట్లు ఆయన వెల్లడించారు.

అభివృద్ధి సంక్షేమం కూటమి తోనే సాధ్యం

- కోట్ల రూపాయలతో మండలాన్ని అభివృద్ధి చేస్తున్నాం - గుమ్మఘట్టలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన ప్రభుత్వ విప్ రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ

భూమి పూజ చేస్తున్న విప్ కాలవ శ్రీనివాసులు మరియు టిడిపి నాయకులు , విలేకరులతో మాట్లాడుతున్న విప్ కాలవ

గుమ్మఘట్ట డిసెంబర్ 13 ప్రభాతవార్త

రాష్ట్రంలో చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. గుమ్మగట్ట మండల కేంద్రం, తాళ్ళకేర ప్రాంతాల్లో శనివారం ఆయన వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. గుమ్మఘట్ట మండలం తాళ్లకేర గ్రామంలో నూతన పి.హెచ్. సెంటర్ నిర్మాణానికి, తాళ్లకేర నుండి తిమ్మలాపురం వరకు సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. అనంతరం గుమ్మఘట్ట మండల కేంద్రంలో మండల రిసెర్చ్ సెంటర్ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఐదేళ్ల జగన్ పాలనలో రాష్ట్రం దివాలా తీసిందని ఆరోపించారు. రూ.10 లక్షల కోట్లపైగా ఆర్థిక భారాన్ని రాష్ట్రంపై మోపారని ధ్వజమెత్తారు. స్వార్థ ప్రయోజనాలే లక్ష్యంగా రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమాన్ని పూర్తిగా అటకెక్కించారని విమర్శించారు. చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక కనీసం ఉద్యోగులకు వేతనాలు ఇవ్వలేని, ప్రభుత్వాన్ని నడపలేని దయనీయ పరిస్థితిని సృష్టించారని తెలియజేశారు. ఇలాంటి పరిస్థితుల్లో తన పాలన అనుభవం, ప్రజలకు సేవ చేయాలన్న దృఢ సంకల్పంతో చంద్రబాబు ఓవైపు సంక్షేమానికి పెద్దపీట వేస్తూనే... అభివృద్ధిని వేగవంతం చేశారన్నారు. ఏడాదిన్నర పాలనలో దాదాపు రూ.50 వేల కోట్ల పింఛన్ల కిందనే అందజేయడం గొప్ప విషయమన్నారు. పెన్షన్ ఒకేసారి రూ.4వేలకు పెంచడంతో పాటు ప్రతి పేద కుటుంబానికి ఏడాదికి మూడు ఉచిత వంటగ్యాస్ సిలిండర్లు ఇవ్వడం, అన్నదాత సుఖీభవ కింద ఏడాదికి రూ.20 వేల ఆర్థిక సహాయం అందజేయడం, తల్లికి వందనం కింద ఒక్కో విద్యార్థికి ఏడాదికి రూ.15వేల ఆర్థిక సాయం అందించడం జరిగిందన్నారు. వీటితో స్త్రీ శక్తి కింద బాలికలకు,మహిళలకు ఆర్టీసీ సర్వీసులో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామన్నారు. అత్యంత వెనుకబడిన గుమ్మగట్ట మండలంలో... బీటీపీ కాకుండా దాదాపు రూ.17కోట్ల విలువైన రహదారులు, భవనాలకు నిధులు మంజూరు చేయించామన్నారు. ఇందులో సిమెంట్, తారు రోడ్లు, మురుగునీటి కాలువలు, భవనాలతో పాటు గ్రామీణ ఆరోగ్య కేంద్రాలకు అత్యధికమైన ప్రాధాన్యమిస్తూనట్లు తెలిపారు. నేషనల్ హెల్త్ మిషన్ నుంచి వచ్చే నిధులు, ఉపాధి హామీ కింద కొంత డబ్బులు ఇవన్నీ జత చేసి పెద్ద ఎత్తున ఈ రోజు గ్రామాల్లో గ్రామీణ ఆరోగ్య కేంద్రాలకు శాశ్వత భవనాలు మిగతా 3 లో...

రుణాల లక్ష్యాలను తప్పనిసరిగా పూర్తి చేయాలి

- సివిల్ స్కోర్ తో సంబంధం లేకుండా బ్యాంకు మేనేజర్లు సోలార్ కనెక్షన్లకు రుణాలు ఇవ్వాలి
- లక్ష్యసాధనలో నిర్లక్ష్యం ఉండరాదు జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ - అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కలెక్టర్, సమావేశంలో పాల్గొన్న బ్యాంక్ అధికారులు,బ్యాంకర్లు

అనంతపురము కలెక్టరేట్ డిసెంబర్ 13 ప్రభాతవార్త

కేంద్ర,రాష్ట్రప్రభుత్వాల పథకాలకు సంబంధించి కేటాయించిన రుణాల లక్ష్యాలను బ్యాంకర్లు పూర్తిస్థాయిలో ఖచ్చితంగా చేరుకోవాలని, ఇందులో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశించారు. అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో నిర్వహించిన జిల్లా సంప్రదింపుల కమిటీ మరియు జిల్లా స్థాయి సమీక్షా కమిటీ సమావేశం (సెప్టెంబర్ 2025 క్వార్టర్)లో అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పీఎం ముద్ర యోజన, పీఎం సూర్యఘర్ యోజన, పీఎంఈజిపి, తదితర కేంద్ర, రాష్ట్ర పథకాలకు సంబంధించిన రుణాల లక్ష్యాలను ఖచ్చితంగా పూర్తి చేయాలన్నారు. పలువురు బ్యాంకర్లు లక్ష్యాలను చేరుకోవడంలో పురోగతి తక్కువగా ఉందని, వెంటనే పురోగతి తీసుకురావాలన్నారు. పీఎం ముద్ర యోజన కింద లక్ష్యాలను చేరుకోవాలని చెప్పామని, అయితే పురోగతి తక్కువగా ఉందన్నారు. సిటీ యూనియన్ బ్యాంక్, బంధన్ బ్యాంక్, కోటక్ మహేంద్ర బ్యాంక్, తదితర బ్యాంకులు ఒకటి కూడా పీఎం ముద్ర యోజన రుణాలు మంజూరు చేయలేదని, వచ్చే సమావేశం నాటికి ఇందులో పురోగతి రావాలని, లేకపోతే తమ నుంచి ఎలాంటి సహకారం అందించమన్నారు. సమావేశానికి రాని బ్యాంకర్లకు మెమోలు ఇవ్వాలని, సమావేశానికి హాజరు కాలేదని వారి గురించి ఎస్ఎల్బీసీకి రాయాలన్నారు. సెంట్రల్ యూనివర్సిటీలో ఒక బ్యాంకు బ్రాంచ్ ను, ఏటీఎంను వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. డిమాండ్ ఉన్నచోట మరూరు, నెలగొండ, సంతేకొండాపురం, తదితర బ్యాంకులు లేని గ్రామాల్లో ఆయా బ్యాంకులు నూతన బ్యాంకు బ్రాంచ్ లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పీఎం సూర్యఘర్ యోజన కింద సిబిల్ స్కోర్ చూసి రుణాలు ఇవ్వకూడదని, సిబిల్ స్కోర్ చూసి రుణాలు ఇస్తాను అని ఏ బ్యాంకు అయినా చెబితే ఈ విషయం ఎస్ఎల్బీసీ దృష్టికి తీసుకెళ్తామన్నారు. పీఎం సూర్యఘర్ యోజన కింద ఆయా బ్యాంకులకు వెళ్లి రిజెక్ట్ అయిన 512 దరఖాస్తులకు సంబంధించి సంబంధిత శాఖ అధికారులతో సమన్వయం చేసుకొని, ఏపిఎస్పిడిసిఎల్ ఎస్ఈకి పంపించి వాటిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ సందర్భంగా ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించి బ్యాంకర్లు వారికి కేటాయించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఆయా బ్యాంకులు సిఎస్ఆర్ నిధులను ఉపయోగించుకోవాలన్నారు. పీఎంఈజీపీ కింద 20 లక్షలు వరకు రుణాలు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవాలని, నిరుద్యోగులకు ఉపాధి చూపించాలనేది ఈ పథకం లక్ష్యంఅని, ఆ లక్ష్యం చేరుకునేందుకు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. బ్యాంకర్లు వారికి వచ్చిన దరఖాస్తులలో రుణాల మంజూరుకు ఉన్న సమస్యలను తెలియజేయాలని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఎల్.డి.ఎం నరేష్ రెడ్డి, ఆర్.బి.ఐ అధికారి రోహిత్ అగర్వాల్, నాబార్డు ఏజిఎం అనురాధ, ఏపిఎస్పిడిసిఎల్ ఎస్ఈ శేషాద్రి శేఖర్, ఏడిసిసి బ్యాంక్ సీఈవో సురేఖ రాణి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఉమాదేవి, జిల్లా పరిశ్రమల శాఖ జెడ్ఎం శ్రీనివాసరావు, మెప్మా పిడి విశ్వజ్యోతి, రూడ్ సెట్ డైరెక్టర్ విజయలక్ష్మి, ఫిషరీస్ డిడి చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా స్కిల్ అధికారి ప్రతాప్ రెడ్డి, పశుసంవర్ధక శాఖ జెడి ప్రేమ్ చంద్, ఆయా బ్యాంకుల అధికారులు, ప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి ఆలయాన్ని సందర్శించిన ఏపి హైకోర్టు జడ్జి

హైకోర్టు జడ్జిని సన్మానిస్తున్న దృశ్యం

లేపాక్షి, డిసెంబర్ 13 ప్రభాతవార్త

ప్రపంచపర్యాటక క్షేత్రంగా ప్రసిద్ధిచెందిన లేపాక్షి శ్రీవీరభద్రస్వామి ఆలయాన్ని శనివారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టుజడ్జి తూటచంద్రధనశేఖర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ చరిత్రను తెలుసుకున్నారు. అనంతరం దుర్గాదేవి వీరభద్రస్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ మర్యాదలతో జడ్జిని సత్కరించారు. ఆయన వెంట ఏడిజె కంపల్లె శైలజ, తహశీల్దార్ సౌజన్యలక్ష్మి, ఈవో నరసింహమూర్తి, ఎస్ఐ నరేంద్ర, తదితరులు ఉన్నారు.

దిక్కు మొక్కులేని పెన్నహోబిళం లక్ష్మినరసింహస్వామి ఆలయం..!

- సెప్టెంబరు నుండి దీర్ఘకాలిక సెలవులో రెగ్యూలర్ కార్యనిర్వహణ అధికారి
- ఇంచార్జ్ ఈవోగా బాధ్యతలు నిర్వహించిన జిల్లా ఏసీ సైతం సెలవులోనే..
- ఇంచార్జ్‌గా నియమించినా బాధ్యతలు చేపట్టని గుంతకల్లు గ్రూప్ టెంపుల్స్ ఈవో
- ఆగస్టులో పూర్తీ కావాల్సిన టెండర్లు నేటికీ జరుగని వైనం, ఆదాయానికి భారీ గండి
- బదిలీ చేసిన నలుగురు రెగ్యూలర్ ఉద్యోగుల స్థానంలో ఎవరినీ నియమించని దైన్యం
- ఆలయాభివృద్ధికి, నూతన రథం తయారీకు భక్తులు ఇస్తున్న విరాళాల సమాచారం కరువే

పెన్నహోబిళంలోని లక్ష్మినరసింహస్వామి ఆలయం

లక్ష్మినరసింహస్వామి మూలవిరాట్

ఉరవకొండ, డిసెంబరు 13 ప్రభాతవార్త

జిల్లాలోనే ప్రసిద్ధి చెందిన ఉరవకొండ మండల పరిధిలోని పెన్నహోబిళంలో వెలసిన లక్ష్మినరసింహస్వామి ఆలయానికి దిక్కు ముక్కు లేకుండా పోయింది. రెగ్యూలర్ కార్యనిర్వహణ అధికారి దీర్ఘకాలిక సెలవులో వెళ్లినప్పటి నుండి ఈ పరిస్థితులు నెలకొంది. పర్యావసానంగా ఆగస్టు నెలలోనే పూర్తీ కావాల్సిన ఆర్థిక వనరులకు సంబంధించిన టెండర్లు డిసెంబరు నెల కూడా గడిచిపోతున్నా పూర్తీ కాకపోగా ఆలయ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. వేలాది ఎకరాల భూములు, ఏడాదికి కోటి రూపాయల వరకు ఆదాయం కల్గిన ఆలయంలో అభివృద్ధి సైతం పడకేసింది. దీంతో భక్తులకు ఇబ్బందులు తప్పడంలేదు.

వివరాల్లోకి వెళితే... పెన్నహోబిళం లక్ష్మినరసింహస్వామి ఆలయ కార్యనిర్వహణ అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్న సాకే రమేష్‌బాబు వివిధ రాజకీయ కారణాలతో సెప్టెంబరు నెల నుండి దీర్ఘకాలిక సెలవులోకి వెళ్లిపోయినప్పటి నుండి ఇబ్బందులు మొదలయ్యాయి. ఆయన స్థానంలో జిల్లా సహాయ కమీషనర్‌గా ఉన్న సి.ఎన్.తిరుమలరెడ్డి ఇంచార్జ్ బాధ్యతలు చేపట్టారు. అయితే ఆయన కూడా గత నెలలో వివిధ కారణాలతో దీర్ఘకాలిక సెలవు పెట్టడంతో దాదాపు నెల రోజుల నుండి ఆలయానికి కార్యనిర్వహణ అధికారే లేకుండా పోయారు. ఇటీవల గుంతకల్లు సమూహ ఆలయాల కార్యనిర్వహణ అధికారి మఠం మల్లికార్జునకు ఇంచార్జ్ బాధ్యతలు అప్పగించగా దాదాపు 20 రోజులు దాటిపోయినా ఆయన బాధ్యతలు చేపట్టలేదు. ఆలయ కార్యనిర్వహణ అధికారి కార్యాలయంలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్లు దీపక్ అశ్వర్థపప్పూరులోని అశ్వర్థనారాయణ చక్రభీమలింగేశ్వరస్వామి ఆలయం, లీలావతమ్మ గూగూడులోని కుళ్లాయస్వామి ఆలయం, అటెండర్ రామకృష్ణ పంపనూరు సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయం, మరో అటెండర్ అశ్వరనారాయణస్వామి ఆలయంకు జూన్ 9న బదిలీ కాగా వారి స్థానంలో నేటికీ ఎవరినీ నియమించకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇక్కడి నుంచి బదిలీ వారు ఆయా ఆలయాల్లో జాయిన్ అయినా అక్కడి రాజకీయ కారణాలతో విధులు నిర్వహించకుండా నేటికీ సెలవులో ఉండటం విశేషం. ప్రస్తుతం కార్యాలయంలో జూనియర్ అసిస్టెంటు మారుతి మినహా రెగ్యూలర్ ఉద్యోగులెవరూ లేకపోవడం మరో విశేషం. ఒకవైపు ఆలయ కార్యనిర్వహణ అధికారి లేకపోవడం, మరోవైపు రెగ్యూలర్ సిబ్బంది బదిలీలతో కార్యాలయ నిర్వహణ అగమ్యగోచరంగా మారింది. తత్ఫలితంగా ఆగస్టు నెలలోనే పూర్తీ కావాల్సిన ఆలయానికి ప్రధాన ఆదాయ వనరులైన తలనీలాలు ప్రోగు చేసుకునే హక్కు, పాత్ర సామానులు బాడుగకు ఇచ్చుకునే హక్కు, ఇదిరవకే ప్రోగు చేసిన తలనీలాల అమ్మకాలు, వివిధ గ్రామాల్లోని ఆలయ భూముల వేలాలు పూర్తీ కాలేదు. దీంతో ఆలయ ఆదానికి భారీగా గండి పడుతోంది. ఆలయానికి కార్యనిర్వహణ అధికారే లేకపోవడంతో ఆలయ అభివృద్ధికి, నూతన రథం తయారీకు భక్తులు అందిస్తున్న విరాళాలు గూర్చి సమాచారమే కరువైంది. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు, జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని లక్ష్మినరసింహస్వామి ఆలయానికి అనుభవం కల్గిన రెగ్యూలర్ కార్యనిర్వహణ అధికారిని నియమించి పాలనను గాడిలో పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నామినేటెడ్ పోస్టుల్లో ముస్లిం మైనార్టీలకు ఎక్కువ అవకాశం ఇవ్వాలి

– కే.ఏం షకీల్ షఫీ ప్రభుత్వానికి వినతి

మాట్లాడుతున్న కెఎం.షకీల్‌షఫి , కెఎం.షకీల్ షఫిని సన్మానిస్తున్న దృశ్యం

అనంతపురం, డిసెంబర్ 13 ప్రభాతవార్త బ్యూరో

రాష్ట్రంలో అధికారంలోఉన్న కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పదవులు, ఇతర కార్పొరేషన్ పదవుల్లో ముస్లిం మైనార్టీలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర ముతవలీల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కే.ఏం.షకీల్ షఫీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం డ్రైవర్స్ కాలనీలో జరిగిన ఓ ఫంక్షన్ హాల్ లో ముస్లిం న్యాయవాదుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. 45 ఏళ్ల పాటు నీతి నిజాయితీ, విలువలతో న్యాయవాద వృత్తిలో కొనసాగిన అడిషనల్ ప్రాసిక్యూటర్ బుడెన్ సాహెబ్‌గా రాష్ట్ర ప్రభుత్వం నియమించడం అభినందనీయమన్నారు. సీనియర్ న్యాయవాదులు బుడెన్ సాబ్, రెహమాన్ కృషి, వృత్తి పట్ల నిబద్ధత అంతా ఇంతా కాదన్నారు. ఇదేవిధంగా ముస్లిం మైనార్టీలకు వివిధ రూపాల్లో రాష్ట్ర ప్రభుత్వం తగిన రీతిలో స్పందించి పదవులు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కాగా అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల ముస్లిం న్యాయవాదుల ఆత్మీయ

02ATP27_02ATP27.qxd 13-12-2025 PM 11:07 Page 1

అధిష్టానం నమ్మకాన్ని నిలబెట్టుకొని పనిచేస్తా

కళ్యాణదుర్గం రూరల్ డిసెంబర్ 13 ప్రభాతవార్త

జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ కుమార్

పార్టీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తో పాటు రాష్ట్ర కార్యవర్గం తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా శాయశక్తులా కృషి చేసే పార్టీ అభివృద్ధికి పాటు పడతానని వైఎస్ఆర్సిపి జిల్లా విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శిగా ఎంపికైన ముచ్చర్లపల్లి నవీన్ కుమార్ తెలిపారు ఇటీవల ప్రకటించిన పార్టీ క్యాడర్లలో తనకు ఈ అవకాశం కల్పించారని నియోజకవర్గం లోని విద్యార్థి సమస్యల పట్ల ఎప్పటికప్పుడు స్పందించి వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానని అలాగే పార్టీ కార్యక్రమాలను విజయవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు స్థానిక సమన్వయకర్త తలారి రంగయ్యకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ఆయన తెలిపారు

ఘనంగా ఆంజనేయ స్వామి రథోత్సవం

రథోత్సవంలో పాల్గొన్న గ్రామ ప్రజలు

రాయదుర్గం రూరల్ డిసెంబర్ 13 ప్రభాతవార్త

మండలంలోని రాయంపల్లి గ్రామంలో ఆంజనేయ స్వామి రథోత్సవాన్ని శనివారం గ్రామ పెద్దలు గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే స్వామివారికి పంచామృత అభిషేకం కుంకుమార్చన వస్త్రాలంకరణ పుష్పాలంకరణ ఆకు పూజ తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం రథాన్ని అందంగా అలంకరించి స్వామివారి ప్రతమను ప్రతిష్టించి గ్రామ పురవీధుల్లో మధ్య డప్పు వాయిద్యాలు మధ్య ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు గావించారు. సందర్భంగా గ్రామంలో బొమ్మల కొలువులు గాజులు దుకాణాలు వెలిసాయి దీంతో గ్రామంలో పండుగ వాతరం నెలకొంది.

లయన్స్ క్లబ్ వారిఉచిత ఎముకల పటుత్వ పరీక్షలు

లైన్స్ క్లబ్ సభ్యులకు సన్మానం

కనేకల్లు డిసెంబర్ 13 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని శ్రీ చిక్కనేశ్వర కళ్యాణమండపం నందు లయన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలోన ఉచిత ఎముకల పట్టుత్వ పరీక్షలు నిర్వహించారు, అనంతపురం డాక్టర్ మహమ్మద్ గౌస్ వారి పర్యవేక్షణలో సుమారుగా 200 మందికి వైద్యపరీక్షలు నిరించారు, కండరాల నొప్పి, కీళ్ల నొప్పులు, ఎముకల సంబంధిత వ్యాధిగ్రస్తులకు వీరికి అన్ని రకాల పరీక్షలు నిర్వహించి అందరికీ సేవలను అందించారు, లయన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో వ్యాధిగ్రస్తులకు గల వారికి 2 వేలు రూపాయల విలువ వైద్య సేవల గల పరీక్షలను మందులను ఉచితంగా అందించారు, అనంతరం అందరికీ భోజన సదుపాయం కూడా ఏర్పాటు చేశారు, ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ సభ్యులు వేలూరు మరియప్ప చాంద్ బాషా శరభన్న గౌడ జయరాం చౌదరి నరేంద్ర చంద్రశేఖర్ గుప్తా ఆది కలేకుర్తి లాలెప్ప కవిటి మాబు అబ్దుల్ రాఫ్ సభ్యులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు

కంబదూరులో న్యూ సి అండ్ ఐజీ మిషన్ చర్చి ప్రారంభం

కంబదూరు, డిసెంబర్ 13, ప్రభాతవార్త

చర్చి ప్రారంభోత్సవానికి హాజరైన సంఘస్తులు

కంబదూరు మండల కేంద్రంలోని ఎన్టీఆర్ సర్కిల్ సమీపం లో న్యూ సి అండ్ ఐజీ మిషన్ చర్చి ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చర్చిలో కేక్ కట్ చేసి సెమీ క్రిస్మస్ వేడుకలను క్రైస్తవ సోదరులు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య ప్రసంగీకులు,దైవ జనులు రెవరెండ్ చల్లగాలి ప్రభాకర్ రావు హాజరై బైబిల్ సందేశాన్ని వినిపించారు.అనంతరం వితంతువులకు, పేదలకు నూతన దుస్తులు పంపిణీ చేశారు.విచ్చేసిన క్రైస్తవ సోదరులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో పాస్టర్ జోయెల్, చర్చ్ సెక్రటరీ ప్రభాకర్, జాయింట్ సెక్రటరీ పాల్ , ట్రెజరర్ నతా నియేల్ ,జాయింట్ ట్రెజరర్ ప్రేమ్ కుమార్, డికెన్ సభ్యులు సోమశేఖర్, రేషం కృపానందం, యోనా తదితరులు పాల్గొన్నారు.

దైవజనులు ప్రభాకర్ రావుకు కేక్ తినిపిస్తున్న చర్చి సభ్యులు

సీసీఆర్ కార్డులున్న రైతులందరికీ బ్యాంకు రుణాలు ఇవ్వాలి

-ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎ.రంగారెడ్డి

ఉరవకొండ, డిసెంబరు 13 ప్రభాతవార్త

లత్తవరంలో జరిగిన కౌలు రైతుల సమావేశం

సీసీఆర్ కార్డులున్న కౌలు రైతులందరికీ బ్యాంకుల ద్వారా పంట రుణాలు అందించాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం అధ్యక్షుడు ఎ.రంగారెడ్డి డిమాండ్ చేశారు. మండల పరిధిలోని లత్తవరంగ్రామంలోని పోలేరమ్మ గుడిలో శనివారం కౌలురైతుల సమస్యలపై చర్చించడానికి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎ.రంగారెడ్డి మాట్లాడుతూ కౌలురైతులందరికీ అన్నదాతసుఖీభవ కింద20వేల రూపాయలు సాయం పంటనష్టానికి ఇన్పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్, రాయితీతో విత్తనాలు, ఎరువులు అందించి నూతన కౌలు రైతు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ఈ సందర్భంగా కౌలు రైతుల సంఘం గ్రామ కమిటీను ఎన్నుకున్నారు. కమిటీఅధ్యక్షుడిగా శివ, కార్యదర్శిగా ధనుంజయ, సహాయ కార్యదర్శిగా శ్రీనివాసులు, కోశాధికారి విజయ్కుమార్, సభ్యులుగా సురేష్,రామాంజినేయులు,లక్ష్మిదేవి,రేవతి,అరుణమ్మ,లాలుస్వామి, సుంకన్న, గోవిందనాయక్,రామాంజినేయులును ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సురేష్, వెంకటేష్, మండల నాయకులు సుంకన్న పాల్గొన్నారు.

పట్టణంలో స్పీడు బ్రేకర్లు ఏర్పాటు

హిందూపురం టౌన్ డిసెంబర్ 13 ప్రభాతవార్త

వార్త ప్రభావం

స్పీడ్ బ్రేకర్లు వేస్తున్న దృశ్యం

వార్త కథనానికి స్పందించిన ఆర్,అండ్,బి అధికారులు హిందూపురం పట్టణ వ్యాప్తంగా స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు చేయించారు. మూడు నెలల క్రితం గణపతి నిమజ్జనానికి తొలగించిన స్పీడ్ బ్రేకర్లు తిరిగి నెలలు గడిచిన వేయకపోవడంతో ఈనెల 4వ తేదీన స్పీడ్ బ్రేకర్లు వేయడానికి ఇంకెన్నాళ్లు పేరుతో ప్రభాతవార్తలో ప్రత్యేక కథనం వెలువడిన విషయం పాఠకులకు తెలిసిందే ప్రభాతవార్త కథనానికి స్పందించిన ఆర్,అండ్,బి అధికారులు శుక్రవారం నుండి స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయిస్తున్నారు. వార్త కథనంతో అధికారులు స్పీడ్ బ్రేకర్లు తిరిగి వేయడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

డివిజనల్ పురుషుల క్రికెట్ పోటీలు

బెలుగుప్ప, డిసెంబర్ 13 ప్రభాతవార్త

క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం డివిజనల్ పురుషుల క్రికెట్ పోటీలు శుక్రవారం బెలుగుప్ప మండలం ఎర్రగుడి క్రీడ మైదానంలో ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గుత్తి డిప్యూటీ డిఇఓ పాటిల్ మల్లారెడ్డి, మల్లికార్జున టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరామ్మోహన్ నాయుడు, ఆవులన్న సర్పంచ్, శ్రీనివాసులు కరస్పాండెంట్ శ్రీనివాస విద్యానికేతన్, ఎర్రి స్వామి ఎర్రగుడి టిడిపి నాయకులు పాల్గొన్నారు. ఈ డివిజనల్ పోటీలలో రాయదుర్గం నియోజకవర్గం ఐదు మండలాలు, కళ్యాణదుర్గం నియోజకవర్గము నుండి ఐదు మండలాలు, బెలుగుప్ప మండలం మొత్తం 11 మండలాలు ఈ డివిజనల్ పోటీలలో పాల్గొంటున్నాయి. ఈ సందర్భంగా గుత్తి డివైఈఓ పాటిల్ మల్లారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉపాధ్యాయులకు కూడా క్రీడలను నిర్వహించి వారిలో ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీయాలని మానసిక ఉల్లాసాన్ని పెంపొందించాలని లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టింది. ఈ మంచి కార్యక్రమాన్ని క్రీడా స్ఫూర్తితో దీనిని పూర్తి చేయాలని ప్రతి ఒక్కరూ గెలుపోటములను సమానంగా స్వీకరించి ఎలాంటి ఉద్వేగాలకు లోను కాకుండా సజావుగా జరిగేటట్లు ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలని తెలియజేశారు. టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఫ్రెండ్లీ నేచర్తో ఉపాధ్యాయుల పట్ల స్నేహపూర్వకంగా ఉండి ఇలాంటి కార్యక్రమాలు ఎన్నో చేపడుతుందని, మనస్ఫూర్తిగా ఉపాధ్యాయులు కూడా ఇలాంటి కార్యక్రమాలను ఆశీర్వదించి విజయవంతం చేయాలని తెలియజేశారు. పాల్గొన్న జట్లకు భోజన వసతిని పాటిల్ మల్లారెడ్డి, క్రీడాకారులకు స్నాక్స్ను శ్రీనివాసులు శ్రీనివాస విద్యానికేతన్ కరస్పాండెంట్ ఏర్పాటు చేశారు. మొదటి మ్యాచ్లో రాయదుర్గం మండలం శెట్టూరు మండలం జట్ల మధ్య జరిగిన మ్యాచ్లో మొదట శెట్టూరు జట్టు బ్యాటింగ్ చేపట్టి 15 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 105 పరుగులు చేసింది. ఆ తరువాత రాయదుర్గం మండలం జట్టు బ్యాటింగ్ చేపట్టి హోరాహోరీగా జరిగిన ఈ మ్యాచ్లో శెట్టూరుపై రాయదుర్గం మండలం 9 వికెట్ల కోల్పోయి 107 పరుగులు చేసి ఒక వికెట్ తేడాతో రాయదుర్గం మండలం జట్టు విజయం సాధించింది. రాయదుర్గం మండలం జట్టులో శంకరన్న హెడ్మాస్టర్ నాలుగు వికెట్లు తీసి జట్టును విజయ బాటలో నడిపించాడు. మధ్యాహ్నం జరిగిన రెండవ మ్యాచ్లో మొదట బ్యాటింగ్ చేపట్టిన బ్రహ్మసముద్రం మండలం జట్టు నిర్ణీత 15 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 163 పరుగులు చేసింది. తరువాత బ్యాటింగ్ చేపట్టిన డి హీరోహాల్ మండల జట్టు 89 పరుగులకు ఆల్ అవుట్ అయింది. బ్రహ్మసముద్రం మండలం జట్టులో మహేష్ అత్యధికంగా 108 పరుగులు చేసి బ్రహ్మసముద్రం మండల జట్టు భారీ స్కోరుకు దోహదపడ్డాడు. ఈ కార్యక్రమంలో శంకరన్న హెడ్మాస్టర్, వేణుగోపాల్ ఎంఈఓ డిహీరేహాళ్, గోపాల్ రెడ్డి కళ్యాణదుర్గం డివిజనల్ కోఆర్డినేటర్, గంగాధర్ పిడి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి ఆర్నోగ్యగా ఉండాలి..

వైద్యాధికారి డాక్టర్ నిఖిత

యస్ సి హాస్టల్ విద్యార్థులకు వైద్య పరీక్షలు

శెట్టూరు, డిసెంబర్ 13 ప్రభాతవార్త

విద్యార్థుల ఆరోగ్యవిషయాలు తెలుసుకొంటున్న డాక్టర్ నిఖిత

మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ బాలుర వసతి గృహంలో ఉన్న విద్యార్థులకు వైద్యాధికారి డాక్టర్ నిఖిత శనివారం వైద్య పరీక్షలు నిర్వహించారు.ప్రతి విద్యార్థి యోగ చేయాలని అలాగే పరిశ్నుభ్రగా ఉండాలని ఎప్పటికప్పుడు చేతులను శుభ్రం చేసుకోవాలని స్నానం చేసి శ్నుభ్రగా ఉండాలని విద్యార్థులకు పలు సలహా సూచనలు తెలిపారు.ఈసం దర్భంగా వైద్యాధికారి డాక్టర్ నిఖిత మాట్లాడుతూ... హాస్టల్ లో ఉన్న ప్రతి విద్యార్థి మంచి ఆర్నోగ్యతో ఉన్నప్పుడే చక్కగా చదువుకోగలమని ఈ చలికాలం ఎక్కువగా దగ్గు, జలుబు, గొంతు నొప్పి, లాంటి వ్యాధులు సంభవించే పరిస్థితులు ఉంటాయి కాబట్టి ప్రతి ఒక్కరూ తమ వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

తెలుగు మహాసభలను విజయవంతం చేయండి

- పోస్టర్లను విడుదల చేసిన ఆలయ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ దేవిస్వామి

గోరంట్ల, డిసెంబర్ 13 ప్రభాతవార్త

పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో గుంటూరులో నిర్వహిస్తున్న మూడవ ప్రపంచ తెలుగు మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ తెలుగు వెలుగు సాహిత్య సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో శ్రీసత్యసాయి జిల్లా గోరంట్లలోని మారెమ్మ దేవాలయంలో రచయితలు డాక్టర్ షమీవుల్లా, నరెడ్డుల రాజారెడ్డి, టి.వి.రెడ్డి, దేవాలయ ప్రధాన అర్చకులు డాక్టర్ దేవిస్వామి ,సాయినాథ్, రామ్మోహన్రెడ్డి, శంకర్లు శనివారం పోస్టర్లను విడుదల చేస్తూ తెలుగు భాషను రక్షించుకోవడం మనందరి బాధ్యతగా గుర్తించాలన్నారు. అందుకు జనవరి 3,4,5 తేదీలలో గుంటూరులో జరుగు ప్రపంచ తెలుగు మహాసభలలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

బాలుడు అదృశ్యం

పరిగి డిసెంబర్ 13(ప్రభాత వార్త)

సత్య సాయి జిల్లా పరిగి మండలం లోనిశిరికోళం గ్రామానికి చెందిన బాలుడు కురుబకార్తీక్(14) ఇంట్లోవాళ్ళు మందలించారనే నెపంతో నిన్నటి దినం శుక్రవారం నాడు ఇంటి నుంచి వెళ్లిపోయాడని పరిగి ఎస్ ఐ రంగడు యాదవ్ తెలియజేశారు, ఎవరికైన ఆచూకి తెలిసినచో ఈ నంబర్లకు తెలుపగలరు పరిగిsi:9440901879, పెనుకొండ Ci 9440796841

బాలుడు కురుబ కార్తిక్

రూ. 22 లక్షలతో ప్రహరీ గోడ నిర్మాణానికి భూమి పూజ

హిందూపురం టౌన్ డిసెంబర్ 13 ప్రభాతవార్త

భూమి పూజ చేస్తున్న దృశ్యం

హిందూపురం పట్టణాభివృద్ధి వేగవంతంగా చేయాలన్నదే బాలయ్య బాబు లక్ష్యమని అందుకోసం వాడవాడలా అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతాయని మున్సిపల్ చైర్పర్సన్ డిఈ రమేష్ కుమార్, కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, వ్యక్తిగతకార్యదర్శి వీరయ్యపేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని చౌడేశ్వరి కాలనీ నందు పార్కు ప్రహరీ గోడ నిర్మాణానికి 15వ ఆర్థిక సంఘం నిధులు 22 లక్షల రూపాయలతో నిర్మించడానికి శనివారం భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి బాలాజీ, వార్డ్ కౌన్సిలర్ రామచంద్ర, పట్టణ అధ్యక్షులు ప్రెస్ వెంకటేష్, టిడిపి నాయకులు పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుత్తిలో మెగా లోక్అదాలత్

- 750 కేసుల పరిష్కారం - రూ.4.56 కోట్ల పరిహారం చెల్లింపు

గుత్తి, డిసెంబర్ 13 ప్రభాతవార్త

లోక్అదాలత్ నిర్వహిస్తున్న దృశ్యం

గుత్తి పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో శనివారం అదనపు జిల్లా జడ్జి సాధుబాబు ఆధ్వర్యంలో సీనియర్ సివిల్ జడ్జి కాశీవిశ్వనాథచారి, జేఎఫ్సిఎం శ్వేత పర్యవేక్షణలో మెగా లోక్అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా 750 కేసులను పరిష్కరించారు. మోటారు వాహనాలకు సంబంధించి 14 కేసులను పరిష్కరించి 97.45 లక్షల రూపాయల పరిహారం ఇప్పించారు. అదేవిధంగా ఒక సివిల్ కేసులో 3.20 కోట్ల రూపాయల మేర పరిహారం చెల్లించే విధంగా కేసును పరిష్కరించారు. దీంతో పాటు పలు జరిమానాలు చెల్లించే ఎక్సైజ్ మరియు తదితర కేసులను అదాలత్లో పరిష్కారం అయ్యాయి. ఈ కార్యక్రమంలో సభ్యులు మహమ్మద్రసూల్, నగదాని ఓబులేసు, వి.సి గంగాధర్, జాకీర్హుస్సేన్, కె.శ్రీనివాసులు, కోర్టు టైపిస్టు సాధిక్బాష, తదితరులు పాల్గొన్నారు.

కంచిసముద్రంలో అంగరంగ వైభవంగా శ్రీసీతారాముల బ్రహ్మరథోత్సవం

శ్రీసీతారాముల బ్రహ్మరథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం, శ్రీసీతారాముల విగ్రహాలకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

లేపాక్షి, డిసెంబర్ 13 ప్రభాతవార్త

లేపాక్షి మండల పరిధిలోని కంచిసముద్రం గ్రామంలో శనివారం భక్తజన సందోహం నడుమ శ్రీసీతారాముల బ్రహ్మరథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. శ్రీగోందావళిసద్గురు బ్రహ్మ చైతన్య స్వాముల వారి 112వ ఆరాధన ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఆగమికులు వేద పండితులు సునీల్శర్మ ఆధ్వర్యంలో బ్రహ్మచైతన్యస్వామి, శ్రీసీతారాముల విగ్రహాలకు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. స్వామివార్లను అందంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా వేదపండితులు నారాయణ హోమం, గణపతి హోమం, శ్రీరామ హోమాదాలు నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి కార్యక్రమం జరిగింది. శ్రీసీతారాముల విగ్రహాలను రామనామ జపంతో ఆలయంనుండి బ్రహ్మరథం వరకు ఊరేగింపుగా మోసుకువచ్చారు. రథంపై స్వామి వారి విగ్రహాలను వుంచి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు రామనామ జపంతో బ్రహ్మరథోత్సవాన్ని ముందుకు కొనసాగించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పిఏ శ్రీనివాసరావు, గ్రీన్ పార్క్ నాగరాజు, నాగలింగారెడ్డి, శ్రీరామ్రెడ్డి, చంద్రశేఖర్గౌడ్, శనివారమప్ప, సర్పంచు గంగలక్ష్మమ్మ, ఎంపిటిసి ఆదినారాయణలతో పాటు అన్ని పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మావటూరు బస్టాండ్లో బస్ షెల్టర్ కూల్చివేత

- కూల్చిన వారిని వెంటనే అరెస్ట్ చేసి జెసిబి ని సీజ్ చేయాలి - వైసీపీ మండల కన్వీనర్ సుధాకరరెడ్డి

ఆధ్వర్యంలో గ్రామ ప్రజలు ధర్నా - చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హామీతో ధర్నా విరమణ

కూల్చివేసిన బస్సు షెల్టర్ స్థలం, రోడ్డుపై ధర్నా చేస్తున్న దృశ్యం

పెనుకొండ డిసెంబర్ 13 (ప్రభాతవార్త)

ధర్నా నువ్వు విరమింప చేస్తున్న ఎస్ఐ , కూల్చివేసిన బస్సు షెల్టర్ ఫైల్ ఫోటో

మండల పరిధిలోని మావటూరు బస్టాండ్ లో ఉన్న బస్సు షెల్టర్ ను శుక్రవారం అర్ధరాత్రి జెసిబి తో కూల్చివేసిన వారిని వెంటనే అరెస్ట్ చేసి,జెసిబిని సీజ్ చేయాలని డిమాండ్ చేస్తూ వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్ సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో సర్పంచ్ నాగరాజు, వైసిపి నాయకులు నాగలూరు ప్రభాకర్ రెడ్డి, మావుటూరు ఎంపీటీసీ శివయ్య,మావుటూరు, నాగలూరు, బండ్లపల్లి, సాని పల్లి గ్రామాల ప్రజలు శనివారం ధర్నా చేపట్టారు.ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ 20 సంవత్సరముల క్రితం ప్రభుత్వ నిధులతో నిర్మించిన బస్సు షెల్టర్ ను కూల్చివేసి, ఆస్థలాన్ని కబ్జా చేయాలనే దురుద్దేశంతో శుక్రవారం అర్ధరాత్రి మావుటూరు గ్రామానికి చెందిన జ్యోతిష్ అనే వ్యక్తి జెసిబి తో కూల్చివేశారని, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసిన ఇలాంటి వ్యక్తిని వెంటనే అరెస్ట్ చేసి, జెసిబి ని సీజ్ చేయాలని కూల్చేసిన బస్సు షెల్టర్ ను తిరిగి ప్రభుత్వనిధులతో నిర్మించాలనిడిమాండ్ చేస్తున్నామన్నారు. సర్పంచ్ నాగరాజు మాట్లాడుతూ రోద్దం మండలం కి చెందిన ఓ టిడిపి నాయకుడి అండతో ప్రభుత్వ ఆస్తి అయిన బస్సు షెల్టర్ ను కూల్చివేయడం టిడిపి నాయకులు చేస్తున్న అభివృద్ధి ఇదేనా అంటూ ప్రశ్నించారు. ప్రభుత్వ ఆస్తి అయిన బస్సు షెల్టర్ ను కూల్చివేసిన జ్యోతిష్ అనే వ్యక్తిని వెంటనే అరెస్ట్ చేసి జెసిబి ని సీజ్ చేయాలని, బస్సు షెల్టర్ను ప్రభుత్వ నిధులతో తిరిగి నిర్మించాలని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. ఈ బస్సు షెల్టర్ వల్ల ఎందరో అభాగ్యులు, నిరాశ్రయులు,ఆశ్రయం పొందుతున్నారని,చుట్టూ ఉన్న నాలుగు గ్రామాల ప్రజలు ప్రయాణించేటప్పుడు, ఎండలకు,వర్షాలకు ఇక్కడ ఆశ్రయం పొంది వేసి ఉండేవారని,ఇలా ప్రజలకు అనేక ప్రయోజనాలు కలిగే బస్సు షెల్టర్ ను కూల్చివేయడం దుర్మార్గమని ఆరోపించారు. పెనుకొండ మడకశిర రోడ్డుపై మావటూరు వద్ద ధర్నా చేపట్టడంతో పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి.విషయం తెలుసుకున్న ఎస్ఐ వెంకటేశులు తన సిబ్బందితో అక్కడకు చేరుకొని ధర్నా విరమింప చేయాలని ధర్నా నిర్వాహకులకు తెలిపారు. బస్ షెల్టర్ కూల్చిన వారిని అరెస్ట్ చేయాలని సుధాకర్ రెడ్డి, నాగరాజు ప్రజలు డిమాండ్ చేశారు. ఎస్సై మాట్లాడుతూ సంబంధిత శాఖలు రెవెన్యూ, ఆర్ అండ్ బి,తదితర శాఖల ద్వారా నివేదికలు తీసుకొని తగు చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఈ ధర్నా కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ సుధాకర్ రెడ్డి,సర్పంచ్ నాగరాజు , నగలురు ప్రభాకర్ రెడ్డి,ఎంపీటీసీ శివయ్య,బండ్లపల్లి ప్రభాకర్, అంజి,మావుటూరు,నాగలూరు, బండ్లపల్లి, సానిపల్లి గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

హిందూ ధర్మం ప్రపంచానికే ఆదర్శం

- హిందువుల ఐక్యత కోసమే సమ్మేళనం - అఖిలభారత ధర్మజాగరణ ప్రముఖ్ శ్యామ్ కుమార్

హిందూ సమ్మేళనంలో ముఖ్య ప్రసంగం చేస్తున్న అఖిలభారత ధర్మ జాగరణ ప్రముఖ శ్యాం కుమార్ , సమావేశంలో ప్రసంగిస్తున్న శ్రీ విద్యా నృసింహ భారతి మహాస్వామి , సమావేశంలో ప్రసంగిస్తున్న విరక్తి గవి మఠం పీఠాధిపతి శ్రీ కళ్యాణ మహాస్వామి, హిందూ సమ్మేళనంలో హిందూ సాంప్రదాయ నృత్యాలు

కళ్యాణదుర్గం, డిసెంబర్ 12 ప్రభాతవార్త: హిందూ ధర్మం మతం కాదని ప్రపంచంలోని మానవాళికి జీవన విధానం సంస్కృతి సాంప్రదాయాలను చాటి చెప్పేదే హిందూ ధర్మమని, అఖిలభారత ధర్మ జాగరణ ప్రముఖ్ శ్యామ్ కుమార్ పేర్కొన్నారు. హిందువుల ఐక్యతను బలోపేతం చేయాలనే లక్ష్యంతో కళ్యాణదుర్గం పట్టణంలో హిందూ సమ్మేళనం శనివారం ఘనంగా జరిగింది. ధర్మవరం రోడ్డులోని పద్మావతి గోవిందరాజుల కళ్యాణమండపంలో నిర్వహించిన ఈ సభకు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు, హిందూ సమాజ ప్రతినిధులు హాజరయ్యారు. హిందూ సమాజం ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో శ్రీ జగద్గురు శంకర దత్తాత్రేయ మహా సంస్థానానికి చెందిన పూజశ్రీ శ్రీ విద్యా నృసింహ భారతి మహాస్వామి, విరక్తిగవి మఠం కళ్యాణదుర్గానికి చెందిన పూజశ్రీ కళ్యాణ మహాస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అఖిల భారత ధర్మ జాగరణ ప్రముఖ్ శ్యాంకుమార్ మాట్లాడుతూ, ఇప్పటివరకు దేశవ్యాప్తంగా సుమారు 80 వేల సమ్మేళనాలు నిర్వహించామని తెలిపారు. దేశం బానిసత్వంలో ఉన్న కాలంలో ఆర్ఎస్ఎస్ ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చిందని, బ్రిటిష్ పాలన కాలంలోనే కాకుండా తరువాత కూడా జాతీయ స్థాయిలో కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. ప్రపంచంలో 50కి పైగా ఇస్లాం దేశాలు ఉన్నాయని, మరో వందకు పైగా క్రిస్టియన్ దేశాలు ఉన్నాయని, అయితే హిందూ సమాజానికి భారతదేశం మాత్రమే ఉన్నదని అభిప్రాయపడ్డారు. హిందూ సమాజం సంఘటితంగా ఉండాల్సిన అవసరం ఉందని, సమైక్యత కోసం ఆర్ఎస్ఎస్ కృషిచేస్తోందని అన్నారు. దేశ ప్రజలు తమ పూర్వీకులు, సంప్రదాయాలను మరిచిపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.మునులు, మహర్షులు యజ్ఞాలు చేసి భారతమాతను కాపాడారని గుర్తు చేశారు.అలాగే 1948లో మహాత్మాగాంధీ హత్య జరిగిన అనంతరం ఆర్ఎస్ఎస్పై నిషేధం విధించారని, ఇందిరాగాంధీ కాలంలో ఎమర్జెన్సీ సమయంలో కూడా ఆ సంస్థ పోరాటం చేసిందని వక్తలు ప్రస్తావించారు. పాలకుల విధానాల వల్ల కుటుంబాన్ని నియంత్రణ కారణంతో దేశంలో హిందూ జనాభా కుదిరించబడిందని, భవిష్యత్తులో హిందువుల జనాభా తగ్గుతోందని, ఇస్లామిక్ విధానాలు విస్తరిస్తున్నాయని, భవిష్యత్తులో భారతదేశం ఇస్లామిక్ దేశంగా మారిన ఆశ్చర్యపోనక్కరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే హిందూ ధర్మాన్ని కాపాడుకోవడానికి కుటుంబ

ఎన్‌డీఏ పాలనలో వాజ్‌పేయి ఆశయాలకు తూట్లు
సిపిఐ నేత జగదీశ్ ఆరోపణ

మాట్లాడుతున్న సిపిఐ జగదీష్

అనంతపురం, డిసెంబర్ 13,(ప్రభాతవార్త బ్యూరో)

ఎన్‌డీఏ పాలనలో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి ఆశయాలకు అడుగడుగునా తూట్లు పొడుస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జగదీశ్ తీవ్ర ఆరోపణలు చేశారు. వాజ్‌పేయి శతజయంతి సందర్భంగా అనంతపురంలో విగ్రహావిష్కరణ చేపట్టడం మంచి పరిణామమే కానీ అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రధానిగా ఉన్న సమయంలో అనుసరించిన ఉన్నత విలువలను ఇప్పుడు భారతీయ జనతా పార్టీ, తెలుగుదేశం పార్టీ నాయకులు కేవలం మాటల్లో మాత్రమే ప్రస్తావిస్తు న్నారని విమర్శించారు. వాజ్‌పేయి ఒక్క ఓటుతో అధికారాన్ని కోల్పోయినా ప్రజాస్వామ్య విధానాన్ని గౌరవిం చారు ప్రస్తుతం నరేంద్ర మోడీ విధానాలు అప్రజాస్వామికంగా ఉన్నాయని అందుకు నిదర్శనం బీహార్ ఎన్నిక లేనని నరేంద్ర మోడీ పాలనలో ఓట్లు చోరీకి అంతేకాకుండా వుందని అదేవిధంగా దేశ సంపదను తన అనువా యులకు దోచే కార్యక్రమం పెద్ద ఎత్తున జరుగుతుందని జగదీష్ పేర్కొన్నా రు. అటల్ బిహారీ వాజ్ పేయి గురించి దొడ్డి దారుల్లో అధికారాన్ని చేపట్టిన వారు మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. విలేకరుల సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పాళ్యం నారాయణ స్వామి,జిల్లా కార్యవర్గ సభ్యులు సి.లింగ్‌మయ్య,బి.రమణయ్య, శ్రీశైలం రాజేష్ గౌడ్, ఈ.కుళ్లాయి స్వామి, నగర సహాయ కార్యదర్శి వి.కృష్ణుడు, నాయకులు పి.అజేయ్ కుమార్ పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతే ధ్యేయంగా పని చేయాలి
- ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తా
- ఏడిసిసి బ్యాంక్ అధ్యక్షులు కేశవరెడ్డి వెల్లడి

మాట్లాడుతున్న ఏడిసిసి బ్యాంక్ అధ్యక్షులు కేశవరెడ్డి

అనంతపురం, డిసెంబర్ 13 ప్రభాతవార్తబ్యూరో

ఏడిసిసి బ్యాంకు ఉన్నతాధికారులతో చర్చించి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని, ఉద్యోగులు కూడా శక్తివంతం లేకుండా సహకార సంఘాలు, సహకార బ్యాంకుల అభ్యున్నతికి కృషి చేస్తారని ఏడిసిసి బ్యాంక్ అధ్యక్షులు ముంటిమడుగు కేశవ రెడ్డి వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం అనంతపురంలో జరిగిన సమావేశంలో బ్యాంక్ చైర్మన్ కేశవరెడ్డి మాట్లాడుతూ.. రైతులకు సహకార సొసైటీలు అండగా నిలవాలని ఉద్దేశంతో ఏడీసీసీ బ్యాంకును వివిధ రూపాల్లో అభివృద్ధి చేయాలని ఆలోచిస్తున్నారని, ఇందుకు సహకార బ్యాంకు ఉద్యోగులు, అధికారుల చేయూత అవసరమని, మీ సమస్యలు పరిష్కరిస్తా కానీ రెట్టింపు ఉత్సాహ ంతో బ్యాంకు పురోగతి కోసం పనిచేయాలని ఆయన సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ అధ్యక్షులు నెట్టెం వెంకటేష్, మాజీ జడ్పిటిసి రామలింగారెడ్డి, తదితర యూనియన్ నాయకులు పాల్గొన్నారు. కాగా అనంతపురం జిల్లా పిఎసిఎస్ ఉద్యోగుల యూనియన్ నూతన కార్యవర్గం శనివారం అనంతపురం పట్టణంలో ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షులుగా ఆర్.శ్రీనివాసులు, జిల్లా జనరల్ సెక్రటరీగా డి.శ్రీనివాసులు, అసోసియేటెడ్ ప్రెసిడెంట్‌గా పి.హనుమంతు రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులుగా డి.నారాయణ, కోశాధికారిగా ఎం.హనుమంతు రెడ్డి ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో సి.ఐ.టి.యు జిల్లా గౌరవ అధ్యక్షులు నాగేంద్ర కుమార్, జిల్లా కోఆపరేటివ్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ మల్లారాయుడు, జనరల్ సెక్రెటరీ కుమార్ పాల్గొన్నారు.

ఎడిసిఎ కార్యదర్శిని సన్మానించిన సీనియర్ క్రీడాకారిణీలు

అనంతపురం సిటీ, డిసెంబర్ 13 ప్రభాతవార్త

అనంతపురం జిల్లా క్రికెట్ అసోషియేషన్ కార్యదర్శిగా నియమితులైన యుగంధర్‌రెడ్డిని శనివారం సీనియర్ మహిళా క్రీడాకారిణీలు ఘనంగా సన్మానించారు. గతంలో మహిళా క్రికెటర్లుగా ఏడిసిఏలో సభ్యులుగా పని చేసి ప్రస్తుతం వివిధ రంగాల్లో స్థిర పడిన మహిళా సీనియర్ క్రీడాకారిణిలు ఏడిసిఎ కార్యదర్శి యుగంధర్‌రెడ్డికి పుష్పగుచ్చం అందించి శాలువాతో సత్కరించి మెమెంటోని అందజేశారు. ఏడిసిఎ కార్యదర్శిగా యుగంధర్‌రెడ్డి మహిళా క్రికెటర్ల మరింత తోడ్పాటును అందిస్తారని వారు ఆకాంక్షించారు. సుదీర్ఘ కాలంగా ఆర్డిటిలో సేవలు అందిస్తున్న యుగంధర్‌రెడ్డికి జిల్లా క్రికెట్ అసోషియేషన్ కార్యదర్శిగా నియమించడంతో మహిళా క్రికెట్ జట్టుకు తోడ్పాటుగా నిలుస్తారని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ మహిళా క్రికెటర్లు లతాదేవి, రాధిక, మంజుళదేవి, సునీత తదితరులు పాల్గొన్నారు.

జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్ష

అనంతపురం న్యూటౌన్, డిసెంఎబర్ 13 ప్రభాతవార్త

జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్ష-2026కు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 6634 మందికి గాను 3899 మంది హాజరు కావడం జరిగిందని అధికారులు తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 29 సెంటర్లలో వచ్చే సంవత్సరం 6వ తరగతి ప్రవేశ పరీక్ష కోసం దేశ వ్యాప్తంగా ప్రవేశ పరీక్ష జరిగినట్లు వారు తెలియజేశారు.

వైఎస్ఆర్‌సిపి నాయకుడు నరసింహారెడ్డిని పరామర్శిస్తున్న బొమ్మన శ్రీరామిరెడ్డి

రామలక్ష్మి భౌతిక కాయానికి నివాళులు అర్పిస్తున్న బొమ్మన శ్రీరామిరెడ్డి

శింగనమల, డిసెంబర్ 13 ప్రభాతవార్త

మండల పరిధిలోని బండమీ దపల్లి గ్రామానికి చెందిన వైఎస్ఆర్‌సిపి నాయకుడు పెద్ద గొర్ల నరసింహారెడ్డి రామల క్ష్మి శనివారం మృతిచెందారు. విష యం తెలుసుకుని సింగిల్ విండో మాజీ అధ్యక్షులు బొమ్మన శ్రీరామిరెడ్డి బండమీదపల్లి గ్రామానికి వెళ్లి రామలక్ష్మి భౌతిక కాయానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని దేవున్ని ప్రార్థిస్తూ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన వెంట నియోజకవర్గ మాజీ సమన్వయ కర్త ఎం.వీరాంజినేయులు, సోదనపల్లి చెవిరెడ్డి, బండమీదపల్లి నారాయణరెడ్డి, పోతురాజు కాలువ నాగప్ప, ఆదిరెడ్డి తదితరులు ఉన్నారు.

రుషిస్కృంగమహాముని జ్ఞాపకార్థం అన్నదానం

జ్ఞాపికను అందజేస్తున్న రామ్‌చరణ్ యాదవ్

శింగనమల, డిసెంబర్ 13 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని శింగన మల మరువకొమ్మ 24వ నాల్గవ శనివారం శ్రీరుషి స్కృంగమ హాముని శ్రీ రంగరాయల వారి జ్ఞాపకార్థం అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు రామ్‌చరణ్ యాదవ్ పేర్కొన్నారు. పెద్ద మట్ల గొంది గ్రామానికి చెందిన చంద్రమోహన్ యాదవ్ సహకా రంతో పూజా కార్యక్రమాలు, అన్నదానం ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రకమంలో చక్రాయి పేట ఎం.ఆదినారాయణ, గోవిందరాయునిపేట ఏకుల ఆది నరసింహులు, అనంతపురం భాస్కర్ రాయల్, బాబయ్య, వారి సహకారం తో ప్రతి శనివా రం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ పూజా కార్యక్ర మానికి మండల పరిధిలోని స్వామివారి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రజలకు అండగా భవిష్యత్తు తరానికి బలమైన నాయకుడు గుమ్మనూరు ఈశ్వర్
- టిడిపి యువనేత రవి వెల్లడి - గుమ్మనూరు ఈశ్వర్‌కు భారీ గజమాలతో సత్కారం

గుమ్మనూరు ఈశ్వర్‌ను భారీ గజమాలతో సత్కరిస్తున్న యువతనే రవి

పామిడి, డిసెంబర్ 13 ప్రభాతవార్త

రాజకీయాల్లో తనదైన శైలిలో ముందుకెళ్తున్న టిడిపి ఇన్‌చార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ ప్రజలకు అండగా భవిష్యత్తు తరానికి బలమైన నాయకుడిగా ఎదుగుతుండటం గర్వించదగ్గ విషయం అని ఆపార్టీ యువనేత రవి పేర్కొన్నారు. గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తనయుడు టిడిపి ఇన్‌చార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ జన్మదినోత్సవ వేడుకలను పురస్కరించుకుని శనివారం ఆపార్టీ యువనేత రవి ఆయనను భారీ గజమాలతో సత్కరిస్తూ పెద్దపాటి కేక్‌ను కట్ చేయించారు.

ఈసందర్భంగా యువనేత రవి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధిలో పరుగులు తీయిస్తుండగా గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం నియో జకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రగామిగి నిలిపేందుకు కృషి చేస్తున్నారని వారిద్దరి ఆశయాలకు అనుగుణంగా టిడిపి ఇన్‌చార్జ్‌గా గుమ్మనూరు ఈశ్వర్ అభి వృద్ధిలో పామిడి రూపురేఖలను మార్చటమే లక్ష్యంగా తన కార్యకళా పాలను ముమ్మరం చేస్తూ ప్రజలకు అండగా వారి అభ్యున్నతికి పాటుపడుతుండ టమే అందకు నిదర్శనం అన్నారు. ప్రజాపక్షం టిడిపి లక్ష్యం అని నాయకులను సమన్వయం చేసుకుంటూ ప్రజలతో మమేకమై వారి సంక్షే మానికి బాటలు వేస్తున్నారని కొనియాడారు. ఎన్నిక ల్లో ప్రజలకు ఇచ్చిన హామీల న్నిం టనీ నెరవేరుస్తూ ఎన్డీఏ కూటమి పార్టీల శ్రేణులు, ప్రజల అభిమా నాన్ని చురగొం టున్న గుమ్మనూ రు ఈశ్వర్ యువతలో మంచి పట్టును సాధిండటం శుభపరిణామం అంటూ భవిష్య తులో ఆయన రాజకీయంగా మరి ంత ఉన్నతంగా ఎదగాలని ఆకాం క్షించారు.

అభివృది సంక్షేమమే గుమ్మనూరు ఈశ్వర్ లక్ష్యం
- గుమ్మనూరు ఈశ్వర్ రాజకీయంగా మరింత ఉన్నతంగా ఎదగాలి
- ఘనంగా గుమ్మనూరు ఈశ్వర్ జన్మదినోత్సవ వేడుకలు

ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పిస్తున్న జింకల సంజీవకుమార్

గుమ్మనూరు ఈశ్వర్ జన్మదినోత్సవ కేక్‌ను కట్ చేస్తున్న టిడిపి నాయకులు

పామిడి, డిసెంబర్ 13 ప్రభాతవార్త

అభివృద్ధి సంక్షేమమే టిడిపి ఇన్‌చార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ లక్ష్యం అని పి.కొత్తపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మెన్ బొల్లు శ్రీనివాసరెడ్డి, గుత్తి మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మెన్ కత్రిమల ప్రభాకర్‌చౌదరీ, పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జ్ జింకల సంజీవ కుమార్, నగరపంచాయతీ మాజీ చైర్మెన్ గౌస్‌ఫీర పేర్కొన్నారు. గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తనయుడు టిడిపి ఇన్ చార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ జన్మదినోత్సవ వేడుకలను పురస్కరించుకుని శనివారం పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలతో నివాళులు అర్పించిన అనంతరం గుత్తి మార్కెట్‌యార్డ్ వైస్‌చైర్మెన్ కొట్టం మాలిక్ ఆధ్వర్యంలో ఆపార్టీ శ్రేణులు గుమ్మనూరు ఈశ్వర్ జన్మదినోత్సవ కేక్‌ను కట్ చేసి సంబరాలను జరుపుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లా డుతూ పార్టీని మరింత బలోపేతం చేస్తూ ప్రజాభ్యున్నతికి పాటుపడుతున్న గుమ్మనూరు ఈశ్వర్ ప్రజల్లో మంచి గుర్తింపును సంపాదిస్తూ తండ్రికి తగ్గ తనయుడిగా నిలుస్తుండటం గర్వించదగ్గ విషయం అన్నారు. ప్రజలు కార్య కర్తల సమస్యలపై తక్షణం స్పందిస్తూ పామిడి అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నారని తెలిపారు. గుమ్మ నూరు ఈశ్వర్ భవిష్యత్తులో రాజకీయ ంగా మరిన్ని ఉన్నత పదవులను అధిరోహిం చాల ని ఆయనకు ఆయురారో గ్యాలు, అస్టైశ్వర్యాలను ప్రసాదించాలని దేవున్ని ప్రార్థిస్తున్నట్టు వెల్లడించారు. ఈకార్యక్రమంలో టిడిపి పట్టణ కన్వీ నర్ బొమ్మా మోహన్, మైనార్టీశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్‌రఫీ, పఠాన్ ఖలందర్, మాజీ కన్వీనర్ హుసేన్‌ఫీర, బాబా ఫకృద్దీన్, నాయకులు సుంకప్ప, తూర్పింటి ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఆస్తులను అమ్మకానికి తాకట్టుపెడితే సహించేదేలేదు
ఖబర్దార్ చంద్రబాబునాయుడు- మాజీ మంత్రి శైలజనాథ్

మాట్లడుతున్న మాజీ మంత్రి సాకే శైలజనాథ్

బుక్కరాయసముద్రం డిశంబర్ 13 ప్రభాతవార్త

ప్రజా ఆస్తులను అమ్మకానికి తాకట్టు పెడితే సహించేదేలేదు మెడికల్ కళాశాలలు ప్రవేటీకరణ ఆపాలి లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడుతామని మాజీ మంత్రి శింగనమల నియోజకవర్గం సమన్వయకర్త డాక్టర్ సాకే శైలజనాథ్ అన్నారు.శనివారం బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని వైసీపీ పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగ వారు మాట్లడుతూ వైఎస్ఆర్సీపీ రాష్ట్ర అధ్య క్షులు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సిఎంగా ఉన్నప్పుడు 17 మెడికల్ కాలేజ్‌లను రాష్ట్రానికి తీసుకొచ్చారు.పేద ప్రజలకు మెరుగైన వైద్యంతో పాటు పేదవి ద్యార్థులను ఉన్నత చదువులను చదివించేందుకు గొప్ప ఆశయం తో మెడికల్ కళాశాలలను తీసుకొచ్చారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినతరువాత మెడికల్ కళాశాలలను అభివృద్ధి చేయాల్సిం ది పోయి చంద్ర బాబునాయుడు మెడికలన కళాశాలలను కమీషన్ల కోసం కక్కతిపడి వాటిని ప్రవేటీకరణ చేయడానికి కుట్రలు పన్ను తున్నారు.కోటి సంతకాల పత్రాలను ఈ నెల 18న వైఎస్ఆర్సీపీ రాష్ట్ర అధ్యక్షులు వైయస్ జగన్మోహన్‌రెడ్డి గవర్నర్‌కు అందజేస్తున్నట్లు తెలిపారు. వాటికి సంఘీభావంగా ఈ నెల 15న అనంత పురం నగరంలో వైసీపీ పార్టీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున బైక్‌ర్యాలీ నిర్వహి స్తున్నారు.ఈ ర్యాలీలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా నియోజకవర్గం మండల అనుబంద సంఘాల అధ్యక్షులు,కార్యదర్శులు, ప్రజాప్రతి నిధులు,పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపుని చ్చారు.ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు గు వ్వల శ్రీకాంత్‌రెడ్డి, సర్ప ంచు పార్వ తి,పూల నారా యణ స్వామి,ఉట్టికాటమ య్య,వైసీపీ ఎస్సీ సెల్ జిల్లా జనరల్ సెక్రటరీ వరికూటి కాటమయ్య, నిమ్మల భాస్కర్,ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు బండారు మారుతి, సూర్య చంద్రరెడ్డి, పవన్‌సాయి, సత్తిరెడ్డి, తదితిరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యలు వద్దు.. వైసిపి తోడుగా ఉంటుంది
- పారిశుద్ధ్య కార్మికురాలిని పరామర్శించిన వైసిపి ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఓబిరెడ్డి

బాధితురాలిని పరామర్శిస్తున్న వైసిపి ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఓబిరెడ్డి

అనంతపురం సిటీ, డిసెంబర్ 13 ప్రభాతవార్త

కూటమి ప్రభుత్వంలో అన్యాయానికి గురై ఆత్మహత్యలకు యత్నించడం పరిష్కారం కాదని మీకు అండగా వైఎస్ఆర్‌సిపి పోరాడుతుందని వైసిపి ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఓబిరెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులను కూటమి నేతలు, తమ ధనార్జన కోసం తొలగించి కొత్తవారిని నియమించుకుంటున్న తరుణంలో ఎన్నో ఏళ్లుగా పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికురాలు పద్మావతి తనకు న్యాయం చేయాలంటూ ఆత్మహత్య యత్నానికి ప్రయత్నించింది. బాధితురాలు పద్మావతిని వైసిపి ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఓబిరెడ్డితోపాటు ట్రేడ్ యూనియన్‌నేతలు శనివారం పరామర్శించారు. బాధితురాలి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ..కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అన్ని వర్గాలను మోసం చేస్తోందన్నారు. ప్రజల సంక్షేమం కంటే ధనార్జనకే కూటమి నేతలు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని విమర్శించారు. అందులో భాగంగానే ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఎన్నో ఏళ్లుగా పారిశుద్ధ్య కార్మికులుగా పని చేస్తున్న వారిని తొలగించి వారి స్థానంలో కొత్తవారిని నియమించుకుని తమ ధనార్జనకు కూటమి నేతలు యత్నిస్తున్నారని విమర్శించారు. ఎన్నో ఏళ్లుగా పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులను యదావిధిగా కొనసాగించాలని వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. పని చేస్తున్న వారిని తొలగింపును ఉపేక్షించ బోమన్నారు. పని చేస్తున్నవారినే కొనసాగించాలని పారిశుద్ధ్య కార్మికులకు అండగా వైఎస్ఆర్‌సిపి పోరాడుతుందని ఆయన స్పష్టం చేశారు. ఇప్ప టికైనా కూటమి నేతలు పారిశు ద్ధ్య కార్మికుల తొలగింపులు మానుకోవాలని ఆయన సూచిం చారు. కార్మికుల పక్షాన వైసిపి ట్రేడ్ యూనియన్ ఎప్పుడు పోరా డుతూనే ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్ర మంలో వైసిపి ట్రేడ్ యూనియన్ నేతలు కొర్రపాడు హుస్సేన్‌పీరా ,రాజశేఖర్‌రెడ్డి, రామాంజి, మహ్మద్ హుస్సేన్, అనిల్‌కుమార్‌గౌడ్, కాకర్ల శ్రీనివాస్‌రెడ్డి, విద్యార్థి విభాగంనాయకులు వెంకటేష్‌రాయల్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి సంక్షేమం కూటమి తోనే సాధ్యం

శంకుస్థాపన చేస్తున్న విప్ కాలవ శ్రీనివాసులు - సిసి రోడ్డు ను ప్రారంభించిన దృశ్యం - పాల్గొన్న టిడిపి నాయకులు కార్యకర్తలు

(మొదటి పేజీ తరువాయి) నిర్మిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా తాళ్లకెరలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు, గుమ్మఘట్టలో మండల రిసోర్స్ సెంటర్కి శనివారం శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు.

వెనుకబడ్డ ప్రాంతాభివృద్ధికి చంద్రబాబు పెద్దపీట...

చంద్రబాబు నాయుడుకి వెనుకబడిన ప్రాంతాల పట్ల ఉన్న ప్రత్యేక శ్రద్ధ, మరీ ముఖ్యంగా రాయదుర్గం బాగుపడాలనే భావన వల్ల ఇవన్నీ తెచ్చుకోగలుగుతున్నామని పేర్కొన్నారు. తాళ్లకేర గ్రామంలోనే రూ.3.50 కోట్లు అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. మొదట రూ.1.40కోట్లతో రోడ్ మంజూరు చేయించామన్నారు. అధికారుల సూచన మేరకు అదే పనిని రూ.50లక్షలుగా విడదీసి మళ్ళీ మంజూరు చేసుకొన్నామనీ వివరించారు. రూ.1.94కోట్లతో హాస్పిటల్, రూ.17.5 లక్షలతో వెల్నెస్ సెంటర కడుతున్నట్లు చెప్పారు. ఇదివరకే తాళ్లకెర, కోనాపురంలో సీసీ రోడ్ వేశారని తాజాగా మరో ప్లు.27.50 లక్షలతో కొత్త సీసీ రోడ్లకు ప్రతిపాదనలు పంపామన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో రాజీపడం.ప్రజలు ప్రధానంగా తమ కుటుంబంతో ప్రశాంతంగా జీవించాలని కోరుకొంటూర్నారు. అలాగే ప్రభుత్వం నుండి తగిన రక్షణ ఆశిస్తారన్నారు. రెండోది సంక్షేమం, మూడోది అభివృద్ధి వారికి ముఖ్యమన్నారు. ప్రజలు ఆశలు ఆశయాలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం ప్రశాంత వాతావరణ ంతో పాటు తగిన రక్షణ, సంక్షేమం, అభివృద్ధి వారికి అందిస్తుందన్నారు.ఈ మూడు విషయాల్లోనూ రాయదుర్గం ఆదర్శంగా నిలుస్తోందని హర్షం వ్యక్తపరిచారు. ఎవరి భూములు వారు దున్నుకొని పంటలు పెట్టుకుంటూ పిల్లా పాపలతో ప్రశాంతంగా జీవిస్తున్నారన్నారు. ఏ ఒక్క గ్రామంలోనూ కక్షలు, కార్పన్యాలు, రాజకీయ గొడవలు లేవన్నారు. ఒకరిపై మరొకరి దౌర్జన్యాలు, బెదిరింపులకు ఆస్కారం లేకుండా చేశామన్నారు. తనకు తెలిసి వైసీపీ పాలనలో కంటే కూటమి పరిపాలనలోనే వైసీపీ కార్యకర్తలు కూడా ప్రశాంతంగా ఉంటారన్నారు. అంత గొప్ప పరిపాలన కూటమి ప్రభుత్వంలో ప్రజలకు అందుతుందన్నారు. ప్రజలు మెచ్చిన, నచ్చిన మంచి పరిపాలన ఇస్తున్న చంద్రబాబు నాయుడు కూటమే ప్రభుత్వానికి ప్రజల ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కాలవ విజ్ఞప్తి చేశారు. రెండేళ్లలో పాఠశాల భవనం నిర్మిస్తాం..గుమ్మగట్ట వద్ద ప్రత్యేక భవనాన్ని నిర్మించి అందరికి అక్కడ వసతి ఏర్పాటు చేయాలని ప్రయత్నం చేస్తున్నామని గుమ్మగట్ట ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఎమ్మెల్యే సూచించారు. ఇదివరకే భవన నిర్మాణం గురించి కలెక్టర్కు వివరించడం జరిగిందన్నారు. ఆయన కూడా సుముఖత వ్యక్తం చేశారన్నారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల ప్రస్తుతానికి ఈ షెడ్లల్లోనే ఉంచాల్సి వస్తుందని వివరించారు. రాబోయే రెండేళ్లలో తప్పకుండా భవన నిర్మాణాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. చదువుకుంటున్న విద్యార్థులందరికీ మంచి వసతి కల్పించాలనది తమ అందరి ఆకాంక్షని తెలిపారు. స్థానికంగా అరకొర వసతుల మధ్యనే పిల్లలు బాగా చదువుకుంటూ విద్యలో రాణిస్తుండటం ఆనందంగా ఉందన్నారు. ఒక అమ్మాయి అయితే 95 మార్కులు సాధిస్తానని చెప్పడం ఆమె ధీమాను మనమంతా అభినందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కాలవ సన్నన్న, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ దానవేంద్ర, మాజీ కన్వీనర్ కురుబ గిరిమల్లప్ప, సర్పంచ్ విజయ లక్ష్మి, నాగరాజు, పోట్ల రవి, సదాశివ , రాము, చిన్ని కృష్ణ, సంజీవ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో సర్వేలతో పాటు ఓటర్ మ్యాపింగ్ ను పూర్తి చేయాలి..
సచివాలయ సిబ్బందికి, బి ఎల్ ఓ లకు తెలిపిన ఎంపీడీవో

సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం.

అనంతపురం రూరల్, డిసెంబర్ 12 ప్రభాతవార్త :

సకాలంలో ప్రభుత్వం నిర్దేశించిన సర్వేలతోపాటు ఓటర్ మ్యాపింగ్ ను పూర్తిచేయాలని సచివాలయ సిబ్బందికి, బి ఎల్ వోలకు ఎంపీ డీవో దివాకర్, తెలియజేశారు. అనంత రూరల్ మండలం రాచానపల్లి పంచాయతీలోనిసచివాలయాన్ని ఆయన తనిఖీ నిర్వహించిసచి వాల య సిబ్బంది, బి ఎల్ ఓ లతో ఇంచార్జ్ పంచాయతీ కార్యదర్శి సర్దార్ వలితో కలిసి సమావేశం నిర్వహించి ఓటర్ మ్యాపింగ్, వివిధ సర్వేల ఏ విధంగా నిర్వహిస్తున్నారని వారిని వివరాలుఅడిగితెలుసుకున్నారు. ఈ సంద ర్భంగా ఆయన రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన వివిధ సర్వేలతోపాటు ఓటర్ మ్యాపింగ్, ఇంటి పన్నుల వసూలు సకాలంలో పూర్తి చేయాలని తెలియజేశారు.

రూరల్ మండల। ఉపాధ్యక్షుడిగా యం. మాధవరెడ్డి

మాధవరెడ్డి

అనంతపురం రూరల్, డిసెంబర్ 13 ప్రభాతవార్త:

అనంతపురం రూరల్ మండల 1 ఉపాధ్యక్షుడిగా కురుకుంట గ్రామ పం చాయతీ వైస్ సర్పంచ్ అయి నా ఎం. మాధవరెడ్డిని వైఎస్ఆర్ సీపీ అధ్యక్షుడు, రాష్ట్ర మాజీ ము ఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ నాయకులు నియమించారు. ఈ సందర్భంగా మాధవరెడ్డి మాట్లాడుతూ రూరల్ మండల 1 ఉపాధ్యక్షుడిగా రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి నా పేరును ఎంపిక చేసి కేంద్ర పార్టీ కార్యాలయానికి పంపడంతో ఆయన ఎంపిక మేరకు, పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ నాయకులు నన్ను రూరల్ మండల 1 ఉపాధ్య క్షుడిగాని యమించడం జరిగిందన్నారు. నా మీద నమ్మకంతో మాజీ ముఖ్య మంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి, తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి, మండల సీనియర్ నాయకులు నన్ను రూరల్,మండల1 ఉపాధ్యక్షుడిగా నియమించడం జరిగిందని వారి నమ్మకాన్ని వమ్ము చేయ కుండా నిత్యం మండలంలోని నా యకులకు కార్యకర్తలకు, ప్రజలకు అందు బాటులో ఉండి కూటమి ప్రభుత్వంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేస్తూ, ప్రజల సమస్యలు పరిష్కారానికి కృషిచేసి మండలంలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి నా వంతు కృషి చేస్తానన్నారు. నా ఎంపికకు సహాయ సహకారాలు అందించిన ప్రతి

04ATP13_04ATP13.qxd 13-12-2025 PM 11:17 Page 1

పిల్లలకు అ, ఆ లు నేర్పే తల్లి అంగన్వాడీ కార్యకర్తే.. పరిటాల సునీత

- అలాంటి తల్లులపై కేసులు పెట్టించిన చరిత్ర వైసీపీ ప్రభుత్వానిదే ..! - అంగన్వాడీలకు సెల్ ఫోన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే సునీత - సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తానన్న ఎమ్మెల్యే సునీత - పిల్లల్ని సెల్ ఫోన్లకు దూరంగా ఉంచాలని సూచన

రామగిరి, డిసెంబర్ 13 ప్రభాతవార్త

పిల్లలకు అన్నం తినడం, అ,ఆలు నేర్పే మొదటి తల్లులు అంగన్వాడీ కార్యకర్తలేనని రాష్ట్రాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. రామగిరి ఎంపీడీవో కార్యాలయంలో అంగన్వాడీలకు సెల్ ఫోన్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. చెన్నేకొత్తపల్లి, రామగిరి, కనగానపల్లి మండలాలలోని అంగన్వాడీలకు సెల్ ఫోన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ అధికారులు, అంగన్వాడీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. చెన్నేకొత్తపల్లి మండలంలో 6మందికి, రామగిరి మండలంలో నలుగురికి, కనగానపల్లి మండలంలో 8మందికి మొత్తం 18 మంది అంగన్వాడీ మినీ వర్కర్స్‌ను మెయిన్ వర్కర్స్‌గా ఉన్నతీకరించారు. వారికి ధ్రువీకరణ పత్రాలను ఎమ్మెల్యే పరిటాల సునీత అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు మెరుగైన సేవలను అందించేందుకు ప్రభుత్వం అంగన్వాడీ కార్యకర్తలకు సెల్ ఫోన్లను పంపిణి చేయడం జరుగుతుందన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

ధృవీకరణ పత్రాలను చూపుతున్న అంగన్వాడి మినీ వర్కర్లు

ఒక్కో సెల్ ఫోన్ ధర 12వేల 500 రూపాయలు వెచ్చించి మీకు ఈ సెల్ ఫోన్లు అందించిందన్నారు. అంగన్వాడీలు ప్రతి రోజూ బాల సంజీవని, పోషణ్ ట్రాకర్, మాతృవందన యోజన.. తదితర యాప్ లు, పిల్లల పోషణ, బరువు, ఎత్తు కొలతలు.. వంటి వాటిని నమో దు చేయాలన్నారు. రాష్ట్రాడు నియోజకవర్గంలోని 6 మండలాల్లోని 349 సెంటర్లలోని అంగన్వాడీ వర్కర్లకు సెల్ ఫోన్స్ పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాల్లో 171 అంగన్వాడీ సెంటర్ల వారికి సెల్ ఫోన్లు అందజేశామన్నారు. పిల్లలకు మరో తల్లిలాగా అన్నీ నేర్పే ది అంగన్వాడీలేనన్నారు. రెండేళ్లు దాటిన తర్వాత నుంచి వారి గురించి అన్ని రకాలుగా తపన పడుతుంటారన్నారు. భోజనం తినేది నేర్పే దగ్గర నుంచి అ,ఆలు దిద్దేది నేర్పించే వరకు అన్నీ వారు ఒక తల్లిలా చూసుకుం టారన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో పరిశుభ్రమైన వాతావరణం ఉండాలని.. ప్రభు త్వం నుంచి వచ్చే ఆహారాన్ని ఎప్పటికప్పుడు అందించాలన్నారు. పాడైపోయిన వాటిని పెట్టి ఇబ్బందికర పరిస్థితులు తీసుకురా వద్దన్నారు. పిల్లల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అక్కడ క్కడ జరిగే పొరుపాట్లు అందరికీ చెడ్డపేరు తెస్తాయన్నారు. గతంలో తాను స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్న సమయంలో చేపట్టిన కార్యక్రమాలను గుర్తు చేశారు. అంగన్వాడీలకు అన్ని రకాలుగా అప్పట్లో అండగా ఉన్నామ న్నారు. కానీ ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వంలో చాలా ఇబ్బందులు ఎదుర్కొ న్నారన్నారు. వేతనాలు, ఇతర సౌకర్యాల కోసం అంగన్వాడీలు పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తే వారి పట్ల కనీస కణికరం లేకుండా ప్రవర్తిం చారన్నారు. తాము కూడా వారికి అప్పుడు అండగా నిలిచామన్నారు. ఇప్పుడు మీ సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి వద్దకు వెళ్తామని హామీ ఇచ్చారు. మీరు అడిగే న్యాయమైన డిమాండ్లు పరిష్కారమయ్యేందుకు చొరవ తీసుకుం టామన్నారు. మరోవైపు పిల్లలకు చిన్న వయసు నుంచే తల్లిదండ్రులు సెల్ ఫోన్లు అలవాటు చేయించారన్నారు. దీని వలన పిల్లలకు చాలా రకాల ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. తల్లిదండ్రులకు పేరెంట్స్ మీటింగ్ నిర్వహించి ఇలాంటి వాటిపై అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే సునీత సూచించారు

ఉద్యోగుల ఐక్యతకు క్రికెట్ పోటీలు

- ఫాదర్ ఫెర్రర్ ఉద్యోగస్తుల క్రికెట్ టోర్నీ - మచ్చా రామలింగారెడ్డి - రాష్ట్ర అధ్యక్షులు ఏపీ వెటరన్స్ క్రికెట్ అసోసియేషన్

అనంతపురం, డిసెంబర్ 13 ప్రభాతవార్త బ్యూరో

ఉద్యోగుల ఐక్యత కోసం జిల్లా వ్యాప్తంగా ఉన్న ఉద్యోగస్తులకు ప్రత్యేక క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం ఉద్యోగులకు స్ఫూర్తినిస్తుందని ఏపీ వెటరన్స్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు మచ్చా రామలింగారెడ్డి అన్నారు అనంతపురం జిల్లా వెటర్నన్స్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫాదర్ ఫెర్రర్ ఎంప్లాయిస్ క్రికెట్ టోర్నమెంట్ సెమీఫైనల్ పోటీలు ఆర్డిటి మైదానంలో ప్రారంభమయ్యాయి.

ఈ ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మచ్చా రామలింగారెడ్డి గౌరవ అతిథిగా యుగంధర్ రెడ్డి జిల్లా క్రికెట్ అసోసి యేషన్ కార్యదర్శి, ఆర్గనైజింగ్ సెక్రటరీ విజయరాజు జాయింట్ సెక్రెటరీ శ్రీధర్ ఇతర అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి మచ్చా రామలింగారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా అనంతపురం జిల్లాలో ఉద్యోగుల కోసం ఒక ప్రత్యేక క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమని నిత్యం పనిఒత్తిడిలో ఉన్న టువంటి ఉద్యోగులకు ఇటువంటి పోటీలు నిర్వహించడం ద్వారా వారిలో నూతన ఉత్సాహాన్ని నింపడానికి ఎంతగానో ఉపయోగపడతాయని మచ్చా అన్నారు జిల్లాలోని 20 టీములు ఉద్యోగస్తుల క్రికెట్ జట్లు ఈ పోటీల్లో పాల్గొనడం ఒక మంచి పరిణామం అని ఇది ఇతర జిల్లాలకు కూడా స్ఫూర్తినిస్తుందని ఇటువంటి పోటీలు నిత్యం నిర్వహించడం ద్వారా ఉద్యోగులకు ఎంతగానో ఉపయోగపడతాయని క్రికెట్ క్రీడ కూడా స్ఫూర్తినిస్తుందని మచ్చా అన్నారు జిల్లా కార్యదర్శి యుగంధర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఉద్యోగులకు ప్రత్యేక టోర్నమెంట్ నిర్వహించడం గత 30 సంవత్సరాలుగా మచ్చా రామలిం గారెడ్డి నాయకత్వంలో ఈ టోర్నమెంట్ జరుగుతున్నాయని ఇది ఉద్యోగులకు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు మొదటి సెమి ఫైనల్ మ్యాచ్ గుంతకల్ రైల్వే జట్టు, కదిరి టీచర్స్ జట్లు మధ్య సెమీఫైనల్ పోటీని మచ్చా రామలింగారెడ్డి బ్యాటింగ్ చేసి లాంఛనంగా ప్రారంభించారు ఈ కార్యక్రమంలో అంపైర్లు వెంకటేష్ నవీన్ సీనియర్ క్రికెటర్లు వెటర్నన్స్ క్రికెట్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు రేపు ఉద్యోగుల క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ ఉంటుందని అనంతరం విజేతలకు బహుమతులు అందజేయడం జరుగుతుందని ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.విజయరాజు తెలిపారు.

మాట్లాడుతున్న మచ్చా రామలింగారెడ్డి

టాస్ వేస్తున్న దృశ్యం

విద్యారంగంలో కీలక మార్పులు తెచ్చిన ఘనత విద్యాశాఖ మంత్రిగా లోకేష్ కే దక్కుతుంది

మడకశిర టౌన్ డిసెంబర్ 13 ప్రభాతవార్త

రాష్ట్రంలో విద్యారంగంలో కీలక మార్పులు తీసుకువచ్చిన ఘనత విద్యాశాఖ మంత్రిగా లోకేష్ కె దక్కుతుందని టీటీడీ బోర్డు మెంబర్, ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలు తెలిపారు. మండలం పరిధిలోని గుండుమల గ్రామంలో నిర్మించిన కేజీబీవీ కళాశాల నూతన భవనాన్ని మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి లతో కలిసి స్థానిక శాసన సభ్యులు, టీటీడీ పాలకమండలి సభ్యులు ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా టిటిడి బోర్డు మెంబర్,ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వా మిలు మాట్లాడుతూ:కూటమి ప్రభుత్వంలో విద్యారంగాన్ని సంస్కరించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుగా, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అనేక కార్యక్రమాలు చేపడుతున్నారు. గత వైసీపీ పాలనలో విద్యా రంగాన్ని జగన్మోహన్ రెడ్డి పూర్తిగా భ్రష్టు పట్టించారని అన్నారు. కళాశాలు భవనాలు, పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్న కనీసం పట్టనట్లు వ్యవహరించారు. విద్యాశాఖ మంత్రిగా లోకేష్ విద్యారంగంలో కీలక మా ర్పులు చేస్తున్నారు. విద్యార్థుల సంక్షేమం కోసం పెద్దపీట వేస్తున్నారు. ఎన్ని ఆర్థిక సమ స్యలు ఉన్న విద్యార్థుల కోసం నిధులు వెచ్చించి ఖర్చు చేస్తు న్నారు. విద్యార్థులు తమకు అందుతున్న అవకాశా లను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలి అని ఎం.ఎస్. రాజు అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్రకార్యదర్శి డాక్టర్ శ్రీనివాస మూర్తి, రాష్ట్ర వక్తలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ.మండల కన్వీనర్ నాగరాజు, కళాశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేజీబీవీ కళాశాలను ప్రారంభించిన ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండమల తిప్పేస్వామి

యోగాతో మానసిక ఒత్తిడి దూరం

- ప్రతి మనిషికి యోగా వల్ల ప్రశాంతత...ఉత్సాహం ఉల్లాసం - అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి వెల్లడి - పివికేకే ఇంజనీరింగ్ కళాశాలలో ఏపీ సబ్ జూనియర్ యోగాసన స్పోర్ట్స్

అనంతపురం, డిసెంబర్ 13 ప్రభాతవార్త బ్యూరో

యోగ వల్ల మనిషికి ఉన్న ఒత్తిళ్ళు దూరం అవుతాయని అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ, మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డిలు పేర్కొన్నారు. అనంతపురం పీవీకేకే కళాశాలలో నిర్వహించిన ఏపీ రాష్ట్ర స్థాయి యోగాసన స్పోర్ట్స్ ఛాంపియన్ షిప్ 2025-2026 కార్యక్రమానికి మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డితో కలిసి ఎంపీ అంబికాలక్ష్మి నారాయణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ నిత్యం కొద్ది సేపు యోగాసనాలు చేయడం వల్ల వారి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని అన్నారు. మన రాష్ట్రంలోని విశాఖ బీచ్‌లో ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లు ఈ అంతర్జాతీయ యోగా డే వేడుకలో పాల్గొని ఘనంగా జరుపుకున్న విషయాన్ని గుర్తు చేశారు. యోగా అభ్యాసనాలు చేయడం వల్ల మనిషి ఆరోగ్యం ఎంతో పదిలం అన్నారు. ప్రతి ఒక్కరూ యోగాను అలవర్చుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పివికేకే ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ పల్లె వెంకటకృష్ణ కిషోర్ రెడ్డి విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రతీ ఒక్కరూ రోజుకు అరగంట యోగాసనాలు సాధన చేయాలని సూచించారు. యోగాసనాలతో అత్యంత ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, కళాశాల చైర్మన్ పల్లె వెంకటకృష్ణ కిషోర్ రెడ్డి చేతుల మీదుగా మెమెంటో ప్రశంస పతనాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన అనంతపురం ఎంపీ అంబిక లక్ష్మీనారాయణను, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డిని, రాష్ట్ర మాంసపు ఉత్పత్తుల కార్పొరేషన్ చైర్మన్ ప్రకాష్ నాయుడును, అనంతపురం మార్కెట్ యార్డ్ చైర్మన్ బల్లా పల్లవి, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వెంకటప్పను, కళాశాల యాజమాన్యం తరఫున పల్లె కుటుంబ సభ్యులు, కళాశాల సిబ్బంది శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రమాంసపు ఉత్పత్తుల కార్పొరేషన్ చైర్మన్ ప్రకాష్ నాయుడు, యోగాసనాల సంఘం గౌరవ అధ్యక్షుడు గొట్టిపాటి రామకృష్ణ, గురువు రాజశేఖర్, అనంతపురం మార్కెట్ యార్డ్ చైర్మన్ బల్లా పల్లవి సురేష్, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వెంకటప్ప, ఇతర ప్రజా ప్రతినిధులు, పివి కేకే ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్ రెడ్డి, ప్రిన్సిపల్ సుబ్బారావు, మన్మధేశ్వర్ రెడ్డి, రమేష్ బాబు, రాఘవేంద్ర శర్మ, సంతోష్ కుమార్ రెడ్డి, ధనుంజయ రెడ్డి, వైభవ్ కళాశాల ఉద్యోగులు విద్యార్థులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పల్లె రఘునాథ్ రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

యోగాసనా స్పోర్ట్స్ కార్యక్రమంలో విజేతలతో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి

తంబలహట్టి తండాకు వెళ్ళి అందించిన ఆహుడా చైర్మన్ టి.సి.వరుణ్

అనంతపురం డిసెంబర్ 13 ప్రభాతవార్త

మ్యాచ్ ఫీజుతో తమ కుటుంబ సభ్యుల ఆకలి తీరుస్తున్నామన్న అంధ మహిళ క్రికెటర్ల మాటలకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చలించిపోయాడు. జట్టు కెప్టెన్ దీపిక వెల్లడించిన వేదన విని వారి కుటుంబ స్థితిగతులు తెలుసుకున్నాడు. దీపికతోపాటు జట్టు సభ్యురాలు పాంగి కరుణ కుమారితోపాటి ఆమె కుటుంబం గురించి తెలుసుకున్నారు. ఈ క్రమంలో ఆ కుటుంబాలకు టీవీ, ఫ్యాను లాంటి గృహోపకరణాలతోపాటు నిత్యావసర సరుకులు, నూతన వస్త్రాలు పంపించాలని ఉప ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నాడు. ఈ మేరకు శనివారం సాయంత్రం శ్రీసత్యసాయి జిల్లా అమరాపురం మండలంలోని తంబాలహట్టి తండాకు వెళ్ళి దీపిక కుటుంబానికి వాటిని అనంతపురం - హిందూపురం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ శ్రీ టి.సి.వరుణ్, జనసేన పార్టీ నేతలు ఆ కుటుంబాన్ని కలుసుకొని ఉప ముఖ్యమంత్రి పంపించిన వస్తు సామగ్రిని, నిత్యవసరాలను, గృహోపకరణాలను, నూతన వస్త్రాలను అందచేశాడు. ఈ సందర్భంగాటి.సి. వరుణ్ మాట్లాడుతూఆ కుటుంబానికి ఏమేమి కావాలో సవివరంగా పవన్ కళ్యాణ్ చెప్పి ఫోలో అప్ చేశారు. వాటిని తక్షణమే అందించాలని స్పష్టం చేశారు. ఆ కుటుంబాలను వారి తరుపున అందించే అవకాశం రావడం ఆనందంగా ఉంది. దీపిక కుటుంబంలో సంతోషం కనిపిస్తోంది. శ్పవన్ కల్యాణ్ గారికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు చెప్పారు.

నిత్యవసర వస్తువులు పంపిణీ చేస్తున్న అహుడ చైర్మన్ టి. సి. వరుణ్

ఎంపీ అంబికాతో కలిసి కోటీ నలబై లక్షల రూపాయలతోపలు అభివృద్ధి పనులు ప్రారంభించిన ధగుపాటి - వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో విజయ దుందిబి మోగిస్తాం.. ఎంపీ అంబికా

అనంతపురం డిసెంబర్ 13 ప్రభాతవార్త

గత ఐదేళ్లలో ఎక్కడా పనులు చేయకుండా నగరాన్ని భ్రష్టు పట్టించారని.. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ విమర్శలు చేశాడు.. నగరంలో ఆయన ఎంపీ అంబికా లక్ష్మీనారాయణతో కలసి పలు అభివృద్ధి కార్యక్రమాలను శనివారం ప్రారంభించారు. ముందుగా రాంనగర్ పార్కు వద్ద రూ.82 లక్షలతో సిసి రోడ్డుకు భూమి పూజ చేశారు. శ్రీకంఠం సర్కిల్ వద్ద 40లక్షల రూపాయలతో సిసి డ్రైన్ కు భూమి పూజ చేశారు. ఉమానగర్ రూ.20లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్ ను ప్రారంభించారు. హౌసింగ్ బోర్డు లోని ఎస్బిఐ కాలనీలో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యే స్వయంగా మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో నగరాన్ని నాశనం చేశారని విమర్శలు చేశారు. ఎక్కడ చూసినా రోడ్లు, డ్రైనేజీలు సమస్యలు కనిపిస్తున్నాయన్నారు. ఒకటిన్నర ఏడాదిలోని కోట్ల రూపాయలతో అన్ని డివిజన్లోనూ రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. సుదీర్ఘకా లం గా పెండింగ్‌లో ఉన్న రుద్ర ంపేట రోడ్డు, రాంనగర్ 80 ఫీట్ రోడ్లను పూర్తి చేశామన్నారు. ఎంపీ అంబికా లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ ని యోజక వర్గంలో ఎక్కడ ఏ సమస్య ఉన్నా ఎమ్మెల్యే దగ్గు పాటి ప్రసాద్ వెంటనే స్పందిస్తున్నారని.. గతంలో ఎప్పు డూ లేనివిధంగా నగరంలో రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తున్నారన్నారు. ఓవైపు అభివృద్ధి మరోవైపు సంక్షేమం కార్యక్రమాలతో కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి.. నగరాన్ని సుందరంగా మారుస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో నగరంలో దుందిబి మోగిస్తామని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ధీమా వ్యక్తం చేశారు.

భూమి పూజ కార్యక్రమం పాల్గొన్న ఎమ్మెల్యే ఎంపీ లు

సీఎం రిలీఫ్ ఫండ్ తో20మందికి రూ.23.87లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే దగ్గుబాటి

అనంతపురం డిసెంబర్ 13 ప్రభాతవార్త

అర్బన్ నియోజకవర్గ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ కిందఆయన మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. మొత్తం 20 మంది లబ్ధిదారులకు 23 లక్షల 87 వేల రూపాయల చెక్కులను శనివారం అందజేశారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ఎమ్మెల్యే దగ్గుపాటికి, ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ గతంలో ఎప్పుడూ లేనివిధంగా అర్బన్ నియోజకవర్గానికి నాలుగు కోట్ల రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారన్నారు.

349మందికి సాయం అందిందన్నారు. అర్బన్ నియోజ కవర్గంలోని ఒక బాలుడికి క్యాన్సర్ వస్తే 18 లక్షల రూపాయలు ఖర్చవుతుం దని వైద్యులు చెబితే.. మంత్రి నారా లోకేష్ చొరవ తీసుకుని బెంగళూరు లోని ఆసుపత్రి వారితో మాట్లాడారన్నారు. 12 లక్షల రూపాయలు ఎల్.ఓ.సి ద్వారా సాయం చేశారన్నారు. ఇవాళ బాలునికి ఆపరేషన్ జరుగు తోందన్నాడు. ఇప్పటికే రాష్ట్రంలో 20 లక్షల కోట్ల రూపాయలు పెట్టుబడలు వచ్చాయని, 20 లక్షల ఉద్యోగాలు వస్తున్నాయన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో ఒక పరిశ్రమమైన వచ్చిందా ఒక ఉద్యోగ మైనా ఇచ్చారా అని ఎమ్మెల్యే దగ్గుబాటి నిలదీశాడు.

సీఎంఆర్ఎఫ్ జక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్

.ప్రతి హామీని ఆచరణలో పెట్టిన నాయకుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి

- వైఎస్ఆర్‌సిపి ఎన్ఆర్ఐ కోఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి

శింగనమల, డిసెంబర్ 13 ప్రభాతవార్త

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎన్ఆర్ఐ విభాగం ఆధ్వర్యంలో ఐర్లాం డ్‌లో మాజీ ముఖ్యమంత్రి వైసిపి అధినేత వైఎస్.జగన్‌మో హన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐర్లాండ్‌లో నివశిస్తున్న వైఎస్ఆర్‌సిపి అభిమానులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరై వేడుకలను విజయ వంతం చేశారు. ఈ సమావేశం లో వైఎస్ఆర్‌సిపి రాష్ట్ర ప్రధాన కార్య దర్శి, ఎ న్ఆర్ఐ విభాగ గ్లోబల్ కోఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి పాల్గొ న్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కేవలం ఒక రాజకీయ నాయకుని గాకాకుండా నిజాయితీ నిబద్ధత కలిగిన ప్రజా నాయకునిగా అభివర్ణించారు. ఎన్నికల మేనిఫెస్టోను ప్రజలతో చేసిన మాటగా భావించి అధికారంలో ఉన్న కాలంలో ప్రతి హామీని అమలు చేసిన నాయకుడు వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజల ఇంటి ముందుకే పాలన చేరిందని గ్రామ/వార్డు సచివాల యాలు ఆర్‌బికెలు వైఎస్ఆర్ హెల్త్ క్లీనిక్‌లు వంటి ప్రజా ఆస్తులు నిరర్మిం చినట్లు తెలిపారు. ఆరోగ్యం విద్య రంగాల్లోచారిత్రాత్మక సంస్కరణలు అమలు అయ్యా యని, పారదర్శక పాలనతో రాష్ట్రం ఆర్థికంగా ముందుకు సాగిం దని వివరించారు. తప్పుడు ప్రచారాలను ఎదుర్కొనేందుకు ఎన్ఆర్ఐలో సోషల్ మీడియా ఓఆర్ఎం, ఎస్ఈఓ వంటి డిజిటల్ వేదికలను సమర్థవం తంగా వినియోగిస్తూ సత్యాన్ని ప్రజల ముందుకు తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. ఐర్లాండ్ వైఎస్ఆర్ సిపి బృందం చూపిన ఐక్యత, నిబద్ధత ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం కేవలం ఒక్కరోజుపుట్టిన రోజు వేడుక కాదని ప్రజల నమ్మకం, నిజాయితీపై ఆధారపడి ముందుకు సాగే ఒక ఉద్యమం అని ఆలూరు సాంబశివారెడ్డి స్పష్టం చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆలూరు సాంబశివారెడ్డి

పేదలకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్

శింగనమల, డిసెంబర్ 13 ప్రభాతవార్త

పేదలకు ఏదైనా అనుకోని ఆపద ఎదురైతే వారిని ఆదుకునేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ అండగా ఉంటుందని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ కింద రాష్ట్ర ముఖ్యమంత్రి మంజూరు చేసిన 11,99,185 రూపాయలు చెక్కులను బాధితులకు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఆపద సమయంలో, వైద్య ఖర్చుల నిమిత్తం ఖర్చు చేసిన డబ్బులను తక్కువ సమయంలోనే వారికి తిరిగి అందజేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకుడు మట్లగొంది అనిల్‌కుమార్ యాదవ్, ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ఆకుల ఉమేష్‌కు దక్కని పదవి - జన సైనికుల్లో నిరాశ

హిందూపురం డిసెంబర్ 13 ప్రభాతవార్త

పవన్ కళ్యాణ్ వీరాభిమాని, స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ కు విశ్వాసపాత్రుడుగా ఉన్న హిందూపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జ్ ఆకుల ఉమేష్ కు ఈసారి కూడా నామినేటెడ్ పదవి దక్కలేదు. దీంతో నియోజకవర్గ జన సైనికుల్లో తీవ్ర నిరాశ వ్యక్తమవుతోంది. జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి నియోజకవర్గంలో పార్టీ పటిష్టతకు కృషి చేయడంతో పాటు పార్టీ ఆదేశాల మేరకు 2014 ఎన్నికల్లో హిందూపురం అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేసి అటు పవన్ ఫ్యాన్స్.. ఇటు రాజకీయ వర్గాల్లో ఆయన ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. 2024 ఎన్నికల్లో ఏపీలో టిడిపి, జనసేన, బిజెపి కూటమిగా ఏర్పడి పోటీ చేయడంతో హిందూపురంలో బాలయ్య హ్యాట్రిక్ విజయాలు సాధించారు.

కూటమితో జట్టు కట్టి పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించి బాలయ్య గెలుపులో ఉమేష్ కీలకంగా తన వంతు పాత్ర పోషించారు. కాగా రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో జనసేన పార్టీ ముఖ్య నాయకులకు నామినేటెడ్ పదవులు ఇచ్చి ప్రాధాన్యత ఇవ్వాలని సర్కారు నిర్ణయించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తో పాటు ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్, శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ ను కూడా కొన్ని నెలల కిందట కిందటే ఆయన వ్యక్తిగతంగా కలిసి నామినేటెడ్ పదవి ఇవ్వాలని వినతిపత్రం అందజేశారు. ఈ క్రమంలో బాలయ్య ఆశీస్సులు కూడా ఉండడంతో ఉమేష్ కు నామినేటెడ్ పదవి లభిస్తుందని జనసేన కార్యకర్తలు ఆశించారు. తొలుత డిసిసిబి ఉమ్మడి అనంతపురం జిల్లా చైర్మన్ ఇస్తారని అధికార పార్టీల వర్గాల్లో ప్రచారం జరిగింది. అయితే సమీకరణలో భాగంగా